# భవిష్యవాదం - పారిభాషిక పదాలు

**భవిష్యవాదం :** భవిష్యత్తును సూచించే విజ్ఞానశాస్త్రం. జర్మన్ చారిత్రకుడు ఆసిఫ్ కాప్లస్టీమ్ 1949లో ఈ పదాన్ని ప్రయోగించారు. అతని తరువాత ఆల్విన్ టాఫ్లర్ ఈ పదానికి మరింత వన్నె చేకూర్చి, భవిష్యత్తు మూడు విధాలుగా ఉంటుందని పేర్కొన్నారు. సంభావ్యత, సంభవనీయత, అధిగణన భవిష్యత్తులని పేర్కొన్నారు. ఆల్విన్ టాఫ్లర్ గ్రంథం ఫ్యూచర్‌షాక్ ప్రపంచఖ్యాతి గాంచినది. ఈ గ్రంథం రాజకీయ, ఆర్థిక, సాంఘిక, వాతావరణ రంగాలనన్నింటిని స్పృశించింది. భవిష్య శాస్త్రవేత్తలు భవిష్య సంఘటనల సంయోజనం, భవిష్య సూచనలు మొదలైన పదాలను పొందుపరచడానికి ప్రయత్నించారు. ఆల్విన్ టాఫ్లర్ అతీత పరిశోధనా పద్ధతులు సమస్త విజ్ఞాన రంగాలను గురించి స్పృశించాయి. ఈ శాస్త్రం మానవ ప్రగతిని అనువర్తిస్తుంది.

**విశ్వసనీయవాదం :** విశ్వాసం మీద ఆధారపడి ఉండే వాదం. భవిష్య శాస్త్రంలో విజ్ఞాన సంబంధమైన మౌలిక సిద్ధాంతాలలో ఇది ఒకటి. ఈ వాదం హేతువు కంటే విశ్వాసానికే ఎక్కువ ప్రముఖ్యమిస్తుంది. ఉన్నత హేతువు అంతర జ్ఞానానికి, అంతర జ్ఞానం విశ్వాసానికి దారితీస్తుంది. అంతర హేతువు, ఆవిష్కృత హేతువు విశ్వాస తత్త్వానికి సన్నిహితంగా ఉంటాయి.

**సావధిక వాదం / పరిమిత వాదం :** పరిమితిని కలిగించునది. ఈ వాదం అపరిమితానికి భిన్నమైనది. మితంలేనిది అపరిమితం, అనంతం. ఉదాహరణకు వ్యక్తిపరిమితమని; భగవంతుడు అపరిమితమని తాత్త్వికులు, భవిష్యత్ వాదులు, అపరిమితంలో పరిమితం సూక్ష్మరూపంలో వుందని శాస్త్రీయవాదులు అంటారు. దీనినే ఆత్మ పరమాత్మ ప్రతిబింబమని వేదాంతికులు అన్నారు.

**భవిష్య రేఖాచిత్రం :** మానవుడు, అతని పరిస్థితులు, ఆలోచనలను గురించి రేఖాచిత్రం సహాయంతో సంక్షిప్తంగా వర్ణించటం. భవిష్య జీవిత చరిత్రను తెలియజేసే రేఖాచిత్రం లేదా సంక్షిప్త వర్ణన. భవిష్య మానవులు, సంఘటనలు, ప్రజాస్వామ్యం, పరిణామం, మానవుని గమ్యం మొదలైన వాటిని గురించి సూచనా ప్రాయంగా శ్రీ అరవిందులు, ఆల్విన్ టాఫ్లర్, మార్గరేట్ మీడ్ వంటి భవిష్యవాదులు తెలియజేస్తున్నారు.

**భవిష్య వనరులు :** భవిష్య ఆర్థిక వనరులకు మానవుడు సాధనంగా ఉంటాడని భవిష్య శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆర్థికశాస్త్రవాదులు భవిష్యత్తులో ఆర్థిక అనార్థిక మానవ వనరులు హరించుకపోతాయని, మానవునికి ఇకముందు మనుగడ సాగించడానికి ఏమీ ఉండదని ఒక భయంకరమైన ఊహతో ఒక వినాశక దృశ్యాన్ని సృష్టించారు. మేధా సంపత్తి ఉన్న మానవుడు రాబోయే వనరులను ప్రశాంత జీవనానికి అనుకూలంగా మలచుకొంటాడని, వనరులను పునరుజ్జీవింపజేస్తాడని, అభివృద్ధికి, పెరుగుదలకు సాధనంగా నిలుస్తాడని భవిష్యవాదులు విశ్వసిస్తున్నారు.

**పునర్మననం :** ఆలోచనలను వ్యక్తీకరించి వాటిని మరల స్వీకరించటం. దీనిని చక్రీయం, యాంత్రికత అని కూడ అంటారు. వైయక్తిక ఆలోచనాభివృద్ధికిది తోడ్పడుతుంది. మానసిక విశ్లేషణ వలన మేలయిన ఆలోచనలు కలుగుతాయి. ఈ పద్ధతి అన్ని రంగాలకు వర్తిస్తుంది.

**ప్రాథమిక వాదం :** నేడు ఇది ఒక సంకుచిత భావం. ఒక మతం మీద విశ్వాసం ఉండి, ఇతర మతాల మీద విశ్వాసంలేని మతవాదుల చేత ప్రేరేపించబడింది. సనాతనంగా వస్తున్న మూఢనమ్మకాలపై విశ్వాసం ఎక్కువ, కాని పరిణామ వికాసాన్ని నమ్మరు. ఈ నమ్మకాలే నేటి మతభేదాలకు మూల కారణాలవుతాయి. పరిణామం అధిగమనానికి దారితీసే మానవులలో జ్ఞానవికాసం కలిగించి అంధకారాన్ని తొలగిస్తుంది.

**స్వేచ్ఛా నిర్ధారణ :** మానవుడు తన ఇష్టానుసారంగా ప్రవర్తించడం స్వేచ్ఛ.

**భౌగోళిక చలనం :** సౌకర్యార్థం జీవి ఒక స్థలం నుండి మరొక స్థలానికి వెళ్ళటం. భూమి, భూమిపై ఉన్న మానవులకు సంబంధించిన శాస్త్రమే భౌగోళికశాస్త్రం. ఇది ఆర్థిక ప్రాకృతిక వనరులపై సాధించిన సంస్కృతిని సూచిస్తుంది. నేడు గ్రామాల నుండి పట్టణాలకు తరలివచ్చే ప్రజలను నిరోధించాలని భవిష్యవాదులు భావిస్తున్నారు. జనాభా అధికం కావటం వలన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. దీనికి పరిష్కారంగా పల్లెలలో గ్రామీణ విశ్వవిద్యాలయాలను, పెద్దపెద్ద వ్యవస్థలను, ప్రభుత్వ కార్యాలయాలను గ్రామాలలో స్థాపించాలని సూచిస్తున్నారు. అప్పుడు భౌగోళిక ప్రాంతాలన్నీ సమానంగా వినియోగింపబడి, అభివృద్ధి చెందుతాయి. మానవులలో సంతృప్తి కలుగుతుంది.

**విశ్వగ్రామం :** విశాల దృక్పథాలతో ప్రపంచ వ్యాప్తి పొందిన ధోరణులున్న గ్రామం విశ్వగ్రామం. గ్రామ ప్రజలను విస్తృత భావాలున్న వారిగా మారుస్తుంది. సూది రంధ్రం నుండి సమస్త ప్రపంచాన్ని దర్శించగలిగినట్లుగా చిన్న సమస్యలను కూడా ప్రపంచ సమస్యల దృష్టితో చూడవచ్చు. ఈనాడు ప్రతి గ్రామాన్ని సంపూర్ణంగా మార్చాలని ప్రతి దేశం ఆశిస్తుంది.

**ప్రపంచీకరణం :** గ్రామ ప్రజలను విస్తృత భావాలున్న వారిగా తీర్చిదిద్దే ప్రక్రియ. ఇది మానసిక, పరహిత, మానవతా విలువలను, వాటి అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

**సామూహిక చికిత్స :** కొంతమంది సామూహికంగా ప్రత్యేకవ్యాధి కోసం తీసుకొనే చికిత్స. వ్యక్తిగత చికిత్స, సామూహిక చికిత్స పద్ధతులు పరామనో విజ్ఞానశాస్త్రంలో ఉపయోగ కరంగా కనిపించాయి. ఒకే విధమైన వ్యాధితో బాధపడే (ఉదాహరణకు ఎయిడ్స్, ఆటలమ్మ) వ్యక్తులకు సామూహిక చికిత్స చేయటం వంటిది.

**జ్ఞేయ చైతన్యం :** వ్యక్తి తన జీవితంలో పొందే పరిణామ, విపరిణామదశ. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వశాస్త్రంలో ఇది ఆధ్యాత్మిక చైతన్యంగా భావింపబడుతుంది. పదార్థంలోని ఆత్మ విన్యాసానికి చైతన్యంయొక్క ఆరోహణావరోహణలు మూల కారకాలు. వ్యక్తిలో కలిగే పరిణామం మూడు రకాలు. అవి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక రూపాంతరీకరణాలు.

**విశ్వీకరణం :** ఇది ఒక పక్రియ. మానవుల ఆలోచనలలో పరిపూర్ణత్వాన్ని కలిగించాలనేది దీని ముఖ్య సిద్ధాంతం. ప్రపంచ క్రమం, ప్రపంచ ప్రభుత్వం అనేవి ఈ సిద్ధాంతాలకు చెందినవే. ప్రజలలో జాగృతి అధికమయ్యే కొద్దీ సమైక్యతతో మానవ ఐక్యతాదర్శం, విశ్వీకరణం అనే సిద్ధాంతాలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి. మానవీకరణం మానవ జాతి విశ్వీకరణకు ఒక సాధనంగా రూపొందుతుంది.

**సత్సంకల్పం :** సదవగాహన సత్ సంకల్పానికి దారితీస్తుంది. భారతీయ చింతనలో సమైక్య సంకల్పం సమైక్య చరితానికి, సమైక్య చరితం సమైక్య జీవనానికి దారితీస్తుంది. సత్‌సంకల్పమే సద్ విశ్వాసంగా పరిగణింపబడుతుంది. భవిష్య వాదులు సత్‌సంకల్పంతో మనం ఏ కార్యం తలపెట్టినా సత్ఫలితాలే లభిస్తాయని విశ్వసిస్తున్నారు.

**అనుక్రమణ :** వ్యక్తులు నియమానుసారంగా ఒక ఉన్నత క్రమంలో ఒకరిపై ఒకరు పర్యవేక్షణ దృషితో ఉంటారు. ఇది ఒక సామూహిక ప్రక్రియ. ఇంగ్లండులో విలియం రాజు భూస్వామ్య వ్యవస్థను ప్రారంభించాడు. ఈ వ్యవస్థలో ప్రజలు కౌలుదారులు, భూస్వాములు. వీరందరిపై రాజు ఉండడం భూస్వామ్య వ్యవస్థలోని అనుక్రమణిక.

కౌలుదారులు తమపై అధికారులకే తల ఒగ్గి ఉన్నారు. వీరు విలియం రాజుకు ప్రత్యక్షంగా విశ్వాస పాత్రులుగా లేనందున ఈ అనుక్రమణిక లోపంతో కూడిందని భవిస్తున్నారు. 1806లో రాజు సాలిస్‌బరీలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి తన కింద వారందరు తనకు విశ్వాసపాత్రులుగా ఉండాలని ప్రమాణ స్వీకారం చేయించాడు. ఇదే సాలిస్‌బరీ ప్రమాణ స్వీకారమని ప్రసిద్ధి చెందింది.

**వారసత్వం :** జీవశాస్త్రంలో పరిసర వారసత్వాలకు ప్రముఖ స్థానముంది. తల్లిదండ్రుల నుండి సంక్రమించేది వారసత్వం. పరిసర ప్రాంతాల ప్రభావం వలన కలిగే గుణాలు పరిసర గుణాలు. ఈ రెండూ వ్యక్తిగత పరిణామానికి తోడ్పడుతాయి. ఆంగిక మనోవిజ్ఞాన శాస్త్రంలో కొద్ది మార్పుతో ఈ రెండు భావాలు కనిపిస్తాయి. వాట్సన్ అనే ప్రవర్తనా మనోవిజ్ఞాన శాస్త్రవేత్త పరిసర ప్రాంతాలకు ప్రాముఖ్యమిచ్చాడు. "శిక్షణ వలన అథమ వ్యక్తిని ఉన్నత వ్యక్తిగా మార్చగలను" అని దృఢంగా వెల్లడించారు. మాక్‌డోగల్ అంతర్యుద్ధ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త. మానవుని అంతర్బుద్ధి అతని భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ప్రధానమైనదని వీరు భావించారు. వీరిరువురూ వారిలో వారు కలహించుకొనటం వలన వీరి వాదోపవాదాలు "బాటిల్ ఆఫ్ బిహేవియర్" (ప్రవర్తనా వాద కలహం) అనే పేరుతో ముద్రింపబడింది.

**ముక్కోణ చిత్ర పద్ధతి :** ఈ పద్ధతి ద్వారా వస్తువును భిన్నకోణాల నుండి దర్శించి చిత్ర పటాన్ని తీయవచ్చును. ఈ విధమైన చిత్రంలో కటకం ఉండదు. లేసర్ బీమ్ కాంతి కిరణాల పద్ధతి ప్రారంభంలో అర్థరహితంగా కనిపించింది. కాని వెలుగులోనికి తెచ్చినప్పుడు మూడు కోణాల చిత్రంగా ప్రదర్శితమైతుంది. భవిష్యవాదులు ఈ చిత్రపట దర్శనాన్ని భవిష్య వివరణలకు నమూనాలుగా ఉపయోగిస్తున్నారు.

**గృహ అధ్యయనం :** సార్వత్రిక విశ్వవిద్యాలయ బోధనపద్ధతులను, ఉత్తర ప్రత్యుత్తర అధ్యయన పద్ధతులను, ప్రైవేటు అధ్యయన పద్దతులను గృహ అధ్యయనంగా పరిగణి స్తున్నారు. జపాన్, కాలిఫోర్నియా వంటి ప్రగతిశీల దేశాలు ఇటువంటి అధ్యయన పద్ధతులను ప్రోత్సహిస్తున్నాయి. రోడ్లపై వాహనాలను తగ్గించటం వలన వాతావరణ కాలుష్యం నిర్మూలనం చేయవచ్చునని గృహ అధ్యయనాలను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలను ప్రసార సాధనాల మూలంగా ఉచిత సమయంలో అందించటం గృహ అధ్యయన పద్ధతిలోని ముఖ్యలక్షణం.

**మానవ వనరులు :** మానవుల్లోని ఆంతర గుణాలు, మౌలిక శక్తి సామర్థ్యాలే మానవ వనరులు. మానవుడు అంతులేని శక్తి స్వరూపుడు. విద్య, నియతమైన క్రమశిక్షణ వలన అతనిలోని ఔన్నత్యాన్ని బహిరంగపరచవచ్చు. భగవంతుని తరువాత ఉన్నతమైన జీవి మానవుడని పరిగణిస్తున్నారు. మానవుని భవిష్యత్తు అమూల్యమైనదని అతనిలో పరిమిత గుణాలున్నాయని, అ పరిమిత గుణంలోనే అపరిమిత గుణాలున్నవాడని భవిష్యవాదులు విశ్వసిస్తున్నారు.

**సజాతీయం :** జీనర్స్ అనే పదం గ్రీకు భాష నుండి వ్యుత్పన్నమైంది. జీనస్ అంటే జాతీయం అని సజాతీయం అని అర్థం. ఒకే స్వభావం, ఒకే గుణం గల వర్గం. హోమో జీనస్ అనగా సామ్యమని, సజాతీయమని భావం. భవిష్యవాదంలో ఈ పదాన్ని క్రియా విశేషణంగా ప్రయోగించారు. సామ్యస్వభావం కలది. డార్విన్ దీనిని జీవశాస్త్రంలో జీవుల నిర్మాణంగా పేర్కొన్నారు.

**మానవ యాంత్రీకరణం :** భవిష్యవాదంలో ఈ పదం తరుచుగా ప్రయోగింపబడుతుంది. ఇంజనీరింగులో యంత్ర నిర్మాణం నైపుణ్యంతో కూడిన పని కాబట్టి మానవ యాంత్రీకరణం కూడ నైపుణ్యంతో కూడిన పని. విద్యుత్

యాంత్రీకరణం, ఎలక్ట్రానిక్ యాంత్రీకరణలా మానవ యాంత్రీకరణ కూడ వాడుకలోనికి వచ్చింది. దీనికి శాస్త్రీయ అధ్యయనం అవసరం. దీనివలన మానవ ప్రవర్తనలో, పనిలో మేలయిన ఫలితాలు కలుగుతాయి. నేటి విద్యా పద్ధతులను అన్వయించుకోవటం వలన సదవగాహన ఏర్పడుతుంది. కొంతమంది నిపుణులు కృత్రిమ విజ్ఞానం అనే యాంత్రిక చైతన్యం కోసం కృషి చేస్తున్నారు.

**హిప్పీలు :** 1966లో కాలిఫోర్నియాలో ఈ పదం పుట్టింది. నీగ్రో గ్రామ్యపదం హీప్‌నుండి ఈ పదం ఏర్పడింది. యువకులు భూగృహాలలో ఉండి సంగీత కలాపాలలో పాల్గొనేవారు. ప్రేమ, శాంతిని నెలకొల్పాలనేది వీరి సిద్ధాంతం. వీరు మాదక ద్రవ్యాలను శరీర సుఖం కోసం సేవిస్తారు. వస్త్రధారణ, కేశసంస్కారం గురించి అంతగా పట్టించుకోరు (హిప్–అనుభవం ఉండాలి అని అర్థం).

**మానవ పరిసర శాస్త్రం :** మానవుని చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల సమస్యలను గురించి చెప్పేది. కాలుష్య క్షాళనం దీని ప్రధాన లక్ష్యం. బాహ్య అంతర కాలుష్య నిర్మూలనానికి మానసిక పరిశుద్ధత అవసరమని భవిష్య వాదులు, మానసిక వైద్య శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. జనాభా నియంత్రణ శాఖావారు కాలుష్య నిర్మూలన గురించి పాటుపడుతున్నారు.

**సమాచార ఒత్తిడి :** విషయాన్ని పట్టిక రూపంలో సేకరించి అవసరమొచ్చినప్పుడల్లా వినియోగించుకోవడం. ఇది కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో సర్వసాధారణంగా ఉపయోగపడే పద్ధతి. భవిష్య వాదులు కూడ ఈ పద్ధతులను అనుసరిస్తున్నారు. కాని దీని వల్ల మెదడు సమాచారాల ఒత్తిడితో నిండి సృజనాత్మకత లోపిస్తుందని భావిస్తున్నారు.

**తాదాత్మ్యం :** సమరూప భావన కలగటం. పిల్లలు తల్లిదండ్రులతో పోల్చుకొని తాదాత్మ్యం పొందుతారు. దీనివలన వ్యక్తిత్వం, మూర్తిమత్వం పెరుగుతుంది. మానసికశాస్త్రంలో దీనిని ప్రగతిగా భావిస్తారు.

**తాదాత్మ్య సంకటం :** తాదాత్మ్యం పొందడంలో ఆటంకం ఏర్పడటాన్ని మానసికశాస్త్రంలో ఒక సమస్యగా పరిగణిస్తున్నారు. ఒక వ్యక్తి రెండు భిన్న గుణాలను తనలో ఇముడ్చుకోవడంలో విఫలుడవటమే దీని ల.

**కల్పనా కేంద్రాలు :** భవిష్య సూచనకు ఉపయోగపడే మేధో కేంద్రాలు. ఇవి దృష్టి, ప్రతిక్రియ, సమన్వయం వంటి మానవ ప్రవర్తనలకు మూల కేంద్రాలు. ఇవి ఊహను, ఆలోచనను, సృజనాత్మకతను, అభిరుచిని తెలియజేస్తాయి. (విజ్ఞాన కేంద్రానికి సమీపంలో కల్పనా కేంద్రం ఉంది.)

**అశాశ్వతం :** 'మానవ జీవితం స్వల్పకాలికం' అంటారు. ఈ ప్రపంచంలో సమస్తం అశాశ్వతమేనని అద్వైతులు, బ్రహ్మ తప్ప ఈ సృష్టిలో సమస్తం శూన్యమని శంకరాచార్యులు చెప్పారు. ప్రపంచంలో ఏదీ అసత్యం కాదని భవిష్యవాదులు విశ్వసిస్తున్నారు.

**అశాశ్వత సూచిక :** మరణానంతరం మానవుడు కొద్ది రోజులపాటు పొందే జ్ఞానప్రమాణం.

**పారిశ్రామిక సంఘం :** పారిశ్రామకీకరణం వలన ఏర్పడిన సంఘం. తొలి, మలి పారిశ్రామిక సంఘాలు వ్యవసాయ సంఘాన్ని అనుసరించి వచ్చాయి. దీని వల్ల సామాజిక సమానత్వం, సమగ్రత ఏర్పడుతుందని హర్బర్ట్ స్పెన్సర్, ఎమిల్ దర్కిమ్ ఆశించారు. మార్కిస్టులు ఇది వర్గ పోరాటానికి దారితీస్తుందని భావించారు. పారిశ్రామిక సంఘం వల్ల శ్రామికులు, జీతగాళ్ళు, అక్షరాస్యులు, పెట్టుబడి దారులు ఏర్పడ్డారని భవిష్య వాదులు అంటున్నారు.

**ద్వైపాక్షిక సంబంధాలు :** ఒక వ్యక్తికి ఇతర వ్యక్తులతో ఉన్న వ్యక్తిగత సంబంధాలు. అమూర్తమైన ఆంతర సంబంధానికి ఇది వ్యతిరేకం. గతిశీల, క్రియాత్మకమైన ఈ సంబంధాలు వ్యక్తిగత వికాసానికి తోడ్పడతాయి.

**ఆంతరీకరణం :** మానవుడిలో అంతఃప్రవృత్తిని తీర్చిదిద్దే ప్రక్రియ. దీనికి సాధన, అధ్యాత్మిక చింతన అవసరం.

**స్వాభావీకరణ :** విలువలు, జ్ఞానం, విజ్ఞాన శాస్త్ర పద్ధతులు, మానవ సంక్షేమం మొదలైన భావాలను తనలో ఇముడ్చుకోవటం వలన మానవ మూర్తిమత్వ వికాసానికి సహాయ పడతుంది.

**జీవన వ్యవధానం :** మానవుడి జీవితకాల పరిమితిని తెలియజేసేది. మునుపు మానవుని సగటు వయస్సు 22 సంవత్సరాలని మైసుమసాన్ని అనే రచయిత 'అవుట్ ఇండియా' అనే గ్రంథంలో చెప్పారు. నేడు ప్రపంచమంతటా మానవుని సగటు వయసు 67 సంవత్సరాలని 1982లో నోబెల్ బహుమాన గ్రహీత జాన్‌వాన్ 'సైలదీ ఆఫ్ మెడిసిన్'లో చెప్పారు. విజ్ఞానశాస్త్రం వృద్ధి చెందే కొద్దీ మానవుని సగటు వయసును పెంచారే కాని అతనిలోని అంతరశక్తి, సామర్థ్యాలను జీవితానుభవాలను సద్వినియోగం చేసుకోవాలనే తలంపు నేటి యువతరానికి లేదని భవిష్యవాదులన్నారు.

**జీవన అలంకరణ పద్ధతులు :** కాలానుగుణంగా మారే జీవన పద్ధతులలో వస్త్రాలంకరణ ఒకటి. విజ్ఞాన శాస్త్రాభివృద్ధితోపాటు కూడ మార్పులు రావడం వల్ల ఆర్థిక భేదాలు సన్నగిల్లాయి. దీని వల్ల సాంస్కృతిక పద్ధతులలో, విలువలలో, నాగరికతలో మార్పులు వచ్చాయి. దర్జీల కుట్టు పద్ధతుల నమూనాల మీద మానవుని జీవన వస్త్రాలంకరణ పద్ధతులు ఆధారపడి ఉన్నాయని శాస్త్రీయవాదులు చెప్పిన మాటలనే భవిష్యవాదులు స్మరించారు.

**జీవన పరిణామ ప్రమాణ కొలమానం :** ఆధునిక సాంకేతిక పద్ధతుల సహాయంతో మానవ జీవన పద్ధతులను, గమనాన్ని స్థిరీకరించే కొలమానం, జీవన పద్ధతులను శాస్త్రీయ దృష్టితో పరిశీలించి ప్రమాణీకరించి సామాన్య జీవన పద్ధతులను ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు.

**కార్యనిర్వహణ :** నైపుణ్యంతో సత్ఫలితాలను పొందడానికి చేసే ప్రయత్నం. గృహ నిర్వహణ, శిశు నిర్వహణ, వైద్య నిర్వహణ, పరిశ్రమల నిర్వహణ, శ్రామిక నిర్వహణ అని పలురకాలు.

**కార్య నిర్వాహకుడు :** నైపుణ్యంతో వ్యవహారాలను నిర్వహించి కొత్త మెళుకువలతో లక్ష్యాన్ని సాధించేవాడు. ఉత్పత్తి, పంపిణీ, అమ్మకం వంటి వ్యవహారాలను చూసేవాడు.

**మానవ శక్తివనరులు :** మానవునిలోని అంతరశక్తి, యాంత్రిక శక్తిని హార్స్ పవర్, వాట్స్ పవర్ అనే మాపకాల సహాయంతో కొలిచారు. కాని మానవశక్తిని కొలిచే సాధనాలు లేవు. మానవశక్తుల మార్పిడి వలన యౌగిక శక్తులు కలుగుతాయని భవిష్యవాదులు అన్నారు.

**వివాహ సూచిక (మ్యారేజ్ ట్రాజెక్టరి) :** వివాహాలకు, విడాకులకు నమోదు చేసే విషయ సూచిక. వైద్య సామాజిక శాస్త్రజ్ఞులకు సామాజిక రుగ్మతలను తెలుసుకోడానికి, చికిత్సా పద్ధతులను అమలులో పెట్టడానికి ఇది ఉపయోగపడుతుంది.

**సామాన్య ప్రసార సాధనం :** అందరిచేత సామాన్యంగా ఉపయోగింపబడే ప్రసార సాధనం. రేడియో, టి.వి. వంటి ఉపగ్రహ ప్రసార పద్ధతులు, ఫోన్లు, తంత్రీ ప్రసార పద్ధతుల వల్ల ప్రయాణాలకు సంబంధించిన సమాచారాలు ప్రపంచంలో జరిగే సంఘటనలను తెలుసుకొని వాస్తవ దృష్టిని కలిగి ఉండే అవకాశం ఏర్పడింది. ఇంతకంటే మేలైన ప్రసార పద్ధతులు ఉంటాయని అవి భవిష్య నాగరికతను సూచిస్తాయని భవిష్య వాదులు తెలియజేస్తున్నారు.

**మానసిక ఆరోగ్యం :** దృఢమైన ఆలోచనలకు, వాటి పెరుగుదలకు, ఆలోచనలను అమలులో పెట్టగలిగే ప్రయత్నాలకు మానసిక ఆరోగ్యం అవసరం. కాని నేడు సమాజంలో స్పర్ధలు, అలవాట్లు, ధ్వనుల వలన సామాన్య మానవుడి మానసిక ఆరోగ్యం నానాటికి దిగజారిపోతుంది. మనస్సు–శరీరం పరస్పర ఆధారాలు కాబట్టి మానసిక ఆరోగ్యం లేనిదే శారీరక ఆరోగ్యం ఉండదని భవిష్య వాదులు విశ్వసిస్తున్నారు.

**మానసిక పరిశుద్ధత :** వ్యక్తిగత పరిసర ఆందోళనలు లేకుండా మానసిక పరిస్థితి స్థిమితంగా ఉండటం. మానసిక పరిశుద్ధత వల్ల శారీరక పరిశుద్ధత ఏర్పడుతుంది. మానసిక పరిశుద్ధత కోసం ఐరోపాలో చికిత్సా సంస్థలున్నాయి.

**నియత గుణవాదం :** అంగాంగి సంబంధాలు తగు ప్రమాణంలో ఉండటం.

**మానసిక పరిసరం :** మానవుని మానసిక పరిస్థితి, మానసిక పరిశుద్ధత వల్ల మానవ అంతరంగ కాలుష్యం తొలగిపోతుంది. మానవ పరిసరశాస్త్రంలో ఈ పదాన్ని వాడుతున్నారు.

**పరమాణు పరిసరం :** మానవుని బాహ్య పరిసరాలను తెలియజేస్తుంది. మానసిక పరిశుద్ధత వల్ల బాహ్య కాలుష్య క్షాళనం కలుగుతుందని భవిష్యవాదులు అన్నారు.

**ప్రేరణాత్మక చలనం :** ప్రేరణ వలన లక్ష్యాన్ని సాధించటం. ప్రేరణ లేని కార్యానికి సంపూర్ణత కలగదు. భవిష్య సూచనకి ఇది అవసరం.

**మూకస్వామ్యం :** నియతి క్రమ పద్ధతిలేని పాలన. సమాజంలో ప్రతి వ్యక్తీ పాలనవ్యవస్థలో హక్కు కావాలనడం.

**నవ్య అనుయాయి/నవ్యజన సమ్మతం :** ప్రత్యేకమైన నడవడి, గుణాల వలన సమాజం వ్యక్తిని గుర్తిస్తుంది. దీని వల్ల ఆ వ్యక్తి తన సహచరుల, సామాన్య ప్రజల అభిమానాన్ని పొందుతారు. నవీన సాంకేతిక పద్ధతుల మూలంగా ప్రజల నమ్మకాన్ని పొందటం సులభం.

**నవ సమాజం :** సంపూర్ణ సమానత్వం, వ్యక్తిత్వాన్ని నిలుపుకోవటం వంటి కొత్త విలువలున్న సమాజం.

**పునరభ్యసన ప్రతిస్పందన :** ప్రావీణ్యం కలగడానికి తీసుకొనే శిక్షణ. దీనికి ప్రతిస్పందన అవసరం. నేటి యువతరం విద్యావిధానంలో మార్పు కోరుతూ ఈ శిక్షణ వైపు మొగ్గు చూపిస్తుంది.

**అధికోద్దీపన పీడనం :** ఉద్దీపన ఎక్కువయ్యే కొద్దీ ప్రతిస్పందన కూడ పెరుగుతుంది. అధికోద్దీపన వలన కలిగే పైపై ఒత్తిడికి మానవులు ప్రతిస్పందిస్తున్నారు. దీని వల్ల తాత్కాలికంగా సంతోషం కలుగుతుంది.

**వ్యవహార చ్యుతం :** చాలా కాలంగా వాడుకలో లేకపోవటం వలన మరుగున పడిపోవటం.

**వృత్తి చలనం :** ఉద్యోగాన్ని బట్టి వ్యక్తి ఒక స్థలం నుండి మరొక స్థలానికి మారటం. దీనివల్ల మానవులు 'ఫ్లాట్'లలో నివసించడానికి సిద్ధపడుతున్నారు.

**వ్యవస్థాపిత మానవుడు :** ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి అలవాటుపడిన వ్యక్తి ఒక క్రమ పద్ధతికి, అభిరుచికి కట్టుబడినవాడు. కార్యనిర్వహణ, విద్యారంగం ఇతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.

**అతివరణం :** నేటి సమాజంలో మానవుడికి అనేక రంగాలతో పరిచయం వుండటం వల్ల ఒక దానిని ఎంపిక చేసుకోవటం కష్టం. ఇదొక సమస్య. అతివరణంలో ఎన్నిక, నిరాకరణ ఉంటుందని భవిష్యవాదులు అన్నారు.

**మలి ఆర్థిక లక్ష్యం :** భవిష్యవాదులు నాగరిక వ్యవస్థను తొలి వ్యవసాయక, మలి వ్యవసాయక వ్యవస్థలని, తొలి, మలి పారిశ్రామిక వ్యవస్థలని, తొలి, మలి ఆర్థిక వ్యవస్థలని వర్గీకరించారు. తిండి బట్ట వంటి అవసరాలు తీరి, మానసిక ఆధ్యాత్మిక లక్ష్యాల కోసం ప్రయత్నించటం వంటి ఆర్థిక లక్ష్యసాధన వల్ల మలి ఆర్థిక లక్ష్యాలు సిద్ధిస్తాయి.

మానవునిలో చైతన్యం పెరిగేకొద్దీ మలి సాంకేతిక ప్రణాళిక లక్ష్యాలు మారుతుంటాయి. మలి సాంకేతిక రంగంలో వ్యక్తి అభిరుచిని బట్టి ప్రణాళిక రంగాలు మారుతుంటాయి. కంప్యూటర్, ఎలక్ట్రానిక్ రంగాలు మలి సాంకేతిక ప్రణాళికల వల్ల ఏర్పడ్డాయి.

**సంభవనీయ భవిష్యత్తు :** (పాసిబుల్ ఫ్యూచర్) వెంటనే(సంభవించేది) జరిగేది. ప్రయత్నం, కృషి, ఏకాగ్రత వల్ల జరుగుతుంది. ఆల్విన్ టాఫ్లర్, 'ఫ్యూచర్‌షాక్' అనే గ్రంథంలో భవిష్యత్తును సంభవనీయ, సంభావ్యన, అధిగణన మని మూడు రకాలుగా వర్గీకరించారు.

**సంభావ్య భవిష్యత్తు :** (ప్రాబబుల్ ఫ్యూచర్) భవిష్యత్తులో జరగవచ్చు, జరగకపోవచ్చు.

**అధిగణన భవిష్యత్తు (ప్రిఫరబుల్ ఫ్యూచర్) :** ఉన్న మార్గాలలో ఒకదానిని ఎన్నుకోవటం. ఈ పద్ధతిలో వర్తమానం భవిష్యత్తుకు దారితీస్తుంది. ఎన్నికకు స్వేచ్ఛ, వరణం అవసరం.

**జనజనిత అపాయాలు :** అధిక జనాభా వల్ల అపాయాలు ఏర్పడ్డాయి. తిండి గింజల కొరత, వ్యాధులు అరికట్ట లేకపోవటం, పరిసర కాలుష్యం, వాహనాల అడ్డగింపు వంటి ప్రమాదాలు ఏర్పడతాయి.

**జీవన వ్యవధానం :** మానవుడి జీవన కాలపరిమితి. పూర్వం మానవుని సగటు వయసు 27, అయితే ఈనాడు 67 సంవత్సరాలు జాగృతి, సాంకేతికాభివృద్ధి వల్ల జీవన వ్యవధానం పెరిగింది.

**భవిష్య మానవులు :** ప్రజ్ఞ, జాగృతి, జీవిత, సమాజాల గురించి అవగాహన ఉన్నవారు. చైతన్య వికాసం వల్ల మూఢనమ్మకాలుండవు. ఎక్కువగా సంచరిస్తుంటారు.

**శాశ్వతం :** జరిగిన సంఘటనలు స్థిరంగా ముద్ర వేసుకోవడం.

**యధేచ్ఛ :** ఉండవలసిన దానికంటే ఎక్కువగా స్వేచ్ఛను కలిగి ఉండటం. పనిచేయడానికి, జీవితాన్ని ఆనందించడానికి స్వేచ్ఛ అవసరం.

**క్రమ వ్యవహార చ్యుతం :** సమాజం కొత్త అలవాట్లను అనుసరించటం వల్ల క్రమేపి పాత అలవాట్లు కొన్ని తొలగిపోతాయి. ఉదాహరణకు పూజా పునస్కారాలు క్రమేపి తొలగిపోతాయి.

**మలి నాగరికత :** ఆటవిక స్థితి నుండి ఎదిగి, సంస్కృతిని పెంపొందింపజేసి, అన్ని జీవులకంటే మానవుడే అత్యుత్తమ జీవి అనేంత మేరకు చేసిన కృషి ఫలితం.

**తొలి పారిశ్రామిక సంఘం :** స్వశక్తిపై ఆధారపడిన సంఘం. ఈ యుగమానవుడు ప్రకృతికి సన్నిహితంగా ఉండే శ్రమజీవి. మానవ కృషి ఫలితాల మీద పారిశ్రామిక సంఘం ఆధారపడి ఉంది.

**మలి పారిశ్రామిక సంఘం :** బుద్ధిని ఉపయోగించి పారిశ్రామిక సాంకేతికాంశాలను సాధించి తద్వారా సుఖజీవనాన్ని గడిపే మానవుల సంఘం (బుద్ధి జీవి).

**స్థిర ఆర్థిక సమాజం :** ధరల నియంత్రణ వలన ఆర్థిక పరిస్థితి స్థిరమై సౌకర్యజీవనాన్ని ఆశించే సమాజం.

**మలి ఆర్థిక సేవ :** శ్రామికులకు మానసిక సంతృప్తిని కలిగించటం. పారిశ్రామిక యాజమాన్యానికి ఆశించిన శ్రమను అందించే వారిలో సేవా దృక్పథం ఏర్పడుతుంది. పారిశ్రామిక కేంద్రం పరస్పర సేవా దృక్పథం గలిగి ఉంటుంది. ఇది భాగస్వామ్య వ్యవస్థకు దారితీస్తుంది. పారిశ్రామికకేంద్రం వృద్ధి చెందుతున్నప్పుడు శ్రామికులకు ఆర్థిక సేవ చేయాలనే తలంపు యాజమాన్యానికి కలుగుతుంది.

**ప్రదర్శన వాదం :** సత్సంకల్పంతో, సద్విశ్వాసంతో ఇచ్చే బహుమతి వల్ల మంచి సంబంధాలు ఏర్పడతాయి. పూర్వం రాజవంశంలో ఈ ప్రదర్శన ఉండేది. నేడు దేశాల మధ్య, వ్యక్తుల మధ్య కనిపిస్తుంది. రెండు దేశాల మధ్య, ఇద్దరు వ్యక్తుల మధ్య రెండు వర్గాల మధ్య సత్సంకల్పంతో సంబంధాలను పెంచుకోవడానికి ఇచ్చి పుచ్చుకొనే సత్సంకల్పం ఏర్పడుతుంది.

**మానసిక తృప్తి సిద్ధాంతం :** ఒక పని చేయటానికి అవసరమైన శక్తిని ఉపయోగించేత సిద్ధాంతం. మానసిక పొదుపు అని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలన్నారు. బస్సు చార్జీలు, రైల్వే చార్జీలలో కొద్దిపాటి ధరల తగ్గింపు కలిగినా ప్రజలలో మానసిక పొదుపు భావం కలుగు తుంది (తక్కువ ధరలో సౌకర్యాలు కలిగినప్పుడు మానవునికి మానసికంగా పొదుపు భావం కలగటం). చార్జీలు, ధరలను తగ్గించి మానసిక తృప్తిని కలిగించే సిద్ధాంతం.

**మానసిక సలహా :** అన్నిరంగాలలో మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు మానసిక సంతృప్తికోసం ఇచ్చే సలహా. వైద్య చికిత్స, వృత్తి శిక్షణకు సంబంధించిన మానసిక యంత్రణాన్ని అమలులో పెడతారు.

**పాల్గొను ప్రజాస్వామ్యం :** సామాన్య ప్రజల హక్కులకు, ఆలోచనలకి విలువ ఇచ్చి ఉత్సాహం ఉన్న సామాన్య ప్రజలు పొల్గొనే ప్రజాస్వామ్యం (ఇటువంటి ప్రజాస్వామ్యం వలన ఆపదలు కలుగుతాయి అని భవిష్యవాదులు అన్నారు). ఉదాహరణకు మూకస్వామ్యం.

**ధర్మోపదేశ వాదం (పెంతికోస్టు వాదం) :** అమెరికాలో ప్రొటెస్టంటులు ప్రారంభించిన ఉద్యమం. పవిత్రాత్మతో మతాన్ని స్వీకరించటం. మళ్ళీ క్రీస్తు జన్మిస్తాడనేది వీరి వాదం. అమెరికా చర్చీలలో ఇటువంటి ఆచరణలు ఎక్కువ. యూదుల పంట మార్పుల పండగ అనే అర్థం కూడా ఉంది.

**ఆశావాద తత్త్వం :** భవిష్యత్తు అనుకూలంగా ఉంటుందనే కోరికతో జీవించటం.

**నిరాశావాద తత్త్వం :** ఏ ప్రయత్నం లేకుండా నిరాశగా జీవించటం. కష్టాలను ఎదుర్కొని బయటపడే ఆశ కనిపించదు. టెన్నిసన్ 'లోటస్ ఈటర్స్'లో నిరాశావాదం కనిపిస్తుంది.

**మానవజాతి మానసిక సమగ్రత :** ఒక వ్యక్తి మానసికంగా పొందిన అనుభూతినే మరొక వ్యక్తి పొందటం. దీనివలన ప్రపంచ సమైక్యత, సమగ్రత కలుగుతాయి.

**నమూనా :** విజ్ఞాన శాస్త్ర సూత్రాలను, ప్రయోగాలను అమలులో పెట్టడానికి పూర్వం తయారు చేసుకున్న నమూనా.

**నిష్క్రియ వాదులు :** చెప్పిన వాటిని క్రియా రూపంలో పెట్టనివారు.

**క్రియా వాదులు :** చెప్పిన వాటిని స్థిర చిత్తంతో తీవ్రంగా పనిచేసే వారు. వీరిలో త్వరణం, ఆశావాదం ఉండటం వల్ల భవిష్య సమాజ నిర్మాణానికి తోడ్పడతారు.

**దుఃఖ అభాస** : శోకం, దుఃఖం వల్ల పని చెడిపోవడం.

**అనన్య అభాస :** కొన్ని సమయాలలో హేతుబద్ధంగా కనిపిస్తుంది. తాను చేసిన పనిని తానే అంగీకరించి పొగడుకోవటం.

**మన శక్తి :** ఏ పనినయినా సాధించగల శక్తి సామర్థ్యాలున్న మనస్సు. ఈ మనస్సును సన్మార్గంలో పెడితే సత్ఫలితాలు కలుగుతాయి.

**మానసీకరణం :** మానసిక విలువలను పెంపొందించటం వల్ల మానసిక స్థితిలో మార్పు రావటం. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వశాస్త్రంలో మూడు గుణాలున్నాయి. అవి: మానవీకరణం, మానసీకరణం, పవిత్రీకరణం.

**మానవీకరణ (హ్యూమనైసేషన్) :** మానవ విలువలను పెంపొందింప జేయాలి. పవిత్రాత్మతో భగవంతుని పొందే స్థితి.

**దివ్యీకరణ (డివినైజేషన్) :** మానవీకరణ, మానసీకరణకు చేరిన తరువాత పవిత్రీకరణ దశకు చేరుకుంటారు.

**ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం :** ప్రజాక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పాటుపడాలనే ప్రజాస్వామ్యం, ప్రజలకోసం అని చెప్పే ప్రజాస్వామ్యం, ఆచరణలో ప్రజలు పాల్గొనే ప్రజాస్వామ్యం ఉండాలని భవిష్య వాదులు అన్నారు.

**పరివర్తన రేటు :** సమాజం మారే పరివర్తన హెచ్చు తగ్గుల వేగం రేటు. విజ్ఞాన సాంకేతిక శాస్త్రాల వల్ల జరిగే పరివర్తన రేటు సమాజ ప్రగతికి సమాంతరంగా ఉంటుంది.

**ప్రతిచర్య కాలం :** ప్రతిస్పందనకి ప్రతిచర్యకి మధ్య ఉన్న కాలం. స్పందన వల్ల ప్రతిస్పందన కలిగి ప్రతిచర్యకి దారితీస్తుంది.

**అద్దె ఇండ్ల ప్రధాన వాదం (రెంటలిజం) :** వృత్తి రీత్యా ఒక స్థలం నుండి మరొక స్థలానికి వెళ్ళటం వల్ల స్వగృహాల మీద ఆధారపడక అద్దె ఇండ్లకి ప్రాధాన్యమివ్వటం.

**సామాజిక భవిష్య వాదం :** భవిష్య ఉద్యోగాలు, పాఠశాలలు రాజకీయాల వంటి సామాజిక సమస్యలను విశ్లేషించి వాటికి పరిష్కారాలను సూచించటం.

**కాలజ్ఞాన వైఫల్యం :** సూచించిన భవిష్యత్ సూచనలు విఫలం కావటం.

**ఉద్యోగ వ్యవస్థ :** గ్రామీణ పరిశ్రమల వల్ల గ్రామ ప్రజలకు ఉద్యోగాలుండటం.

**పారిస్థితికాంశాలు :** మానవునికి పరిసరాలకు మధ్య ఉన్న సంబంధం. ఇవి ఐదు రకాలని భవిష్యత్ వాదులు అన్నారు.వ్యక్తికి ఇతరులతో, వస్తువులతో, ప్రాంతాలతో, ఆలోచనలతో, కాలంతో ఉన్న సంబంధం.

**పరిస్థితి సంబంధాలు :** పరిస్థితులతో ఉన్న సంబంధం.

**ప్రదర్శిత పరిసరాలు :** నూతన ఆర్థిక వ్యవస్థ కోసం అన్ని విధాలా వృద్ధి చెందే పరిసరాలు.

**సామాజిక సూచికలు :** ఉత్పత్తి, ధరలు, పెట్టుబడి, పంపిణి వంటి విషయాలను తెలియ జేసే సూచిక.

**ఆర్థిక సూచికలు :** ఆర్థిక వ్యవస్థలోని పెట్టుబడి, ఉత్పత్తి, ధరలు, పంపిణీలలో హెచ్చు తగ్గులను తెలియజేసే సూచికలు.

కాలంతోపాటు మానవుని అలవాట్లు ఎంత మారినా కొన్ని అలవాట్లు మాత్రం స్థిరంగా కొంత కాలంపాటు ఉంటాయి. మానవునిలో మారని అలవాట్లు (విలువలు). వీటి వల్ల ఐకమత్యం, సమన్వయం కలుగుతుంది.

**సామాజిక అంశాలు :** నీతి, ఆధ్యాత్మిక, మానసిక, మానవ విలువలు పరస్పర చర్య కలిగి ఉంటాయి. సామాజిక లక్ష్య సాధనకు తోడ్పడతాయి.

**ప్రమాణీకరణ :** ఏ రంగంలోనయినా ఒకే విధమైన పద్ధతిని ప్రజలు అనుసరించటంలో, పరిమిత వరణం ఉంటుంది. పరిమిత వరణం వల్ల స్వతంత్ర ఇచ్ఛతో ఎన్నుకోవటం జరుగుతుంది.

**ఉద్దీపన ఆకలి :** ఆహారపదార్థాలు సమృద్ధిగా ఉన్నా ప్రజలకు అందుబాటులో లేకపోవటం వల్ల మానసికంగా కలిగే ఆకలి బాధ.

**అసంగత శైలి :** భవిష్య సమాజంలో మానవులకు శైలీ చైతన్యం ఉండదు. దుస్తులను గురించి పట్టించుకోకుండా జీవనశైలి చైతన్యాన్ని కలిగి ఉంటారు.

**విజ్ఞాన విధానం :** ఆర్థిక సహకారాభివృద్ధి కోసం, పరస్పర లాభంకోసం, సాంకేతిక పద్ధతుల వల్ల అన్ని దేశాల వారు అనుసరించే కార్యాచరణ విధానం.

**సాంకేతిక ప్రణాళిక :** ఆర్థిక పురోగతి కోసం చేపట్టిన పద్ధతి.

**సాంకేతిక సమాజం :** సాంకేతిక పద్ధతుల వల్ల అభివృద్ధి చెందే సమాజం.

**కాలపక్షపాతం :** భూత, వర్తమాన, భవిష్య కాలాల వైపు మానవులు చూపే మొగ్గు.

**అశాశ్వతం :** ఆర్థిక పొదుపు కోసం, తక్కువ కాలం వాడుకకోసం చేసే వస్తువుల ఉత్పత్తి.

**క్షణికం :** కాలంతోపాటు మారుతున్న విలువలు.

**అల్ప ఉద్దీపన :** ప్రతిస్పందనకు ఉండవలసిన స్పందన లేకపోవటం.

**పరిమిత వృష్టి కుటుంబం :** జీవన సంఘర్షణ ప్రధానంగా ఉన్న చిన్న కుటుంబం.

**ప్రపంచ భవిష్య సంఘం :** ప్రపంచ భవిష్యత్తును సూచించే కొన్ని సంఘాలు.

**భవిష్య కౌంటర్లు :** ప్రపంచ భవిష్యత్తు సూచించటానికి కొన్ని సంఘాలు ఏర్పరిచిన కౌంటర్లు, సమాచారం దొరికే స్థలం.

**ప్రపంచ ప్రదర్శన :** అన్ని దేశాల సహకారంతో వైమానిక, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో జరుగుతున్న, సాధించిన అభివృద్ధిని ప్రదర్శించటం. ఇది ప్రపంచ ఐక్యతాదర్శాన్ని తెలియ జేస్తుంది.

**ప్రపంచ క్రమం :** విశ్వశాంతి, సమైక్యతల కోసం విద్యా, సాంకేతిక రంగాలలో ప్రపంచ మంతటా ఒకే విధమైన పద్ధతులను అమలులో పెట్టటం.

**ప్రపంచ ప్రభుత్వం :** ప్రపంచానికంతటికీ ఒకే విధమైన పరిపాలన దృక్పథం.

**భవిష్య వాదులు :** ప్రపంచ సమైక్యత కోసం భవిష్యత్ సంఘటనలను గురించి ఆలోచించి రాబోయే ఆపదలకు పరిష్కారంగా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించేవారు.

**శిశు సంరక్షక నిపుణులు :** తల్లిదండ్రులు లేని సమయంలో పిల్లల రక్షణ భారాన్ని నైపుణ్యంతో స్వీకరించేవారు.

**అనుక్రమణ సిద్ధాంతం :** ఆలోచనలను ఒక క్రమంలో పెట్టడం. దీనిని గ్రీకు తత్త్వవేత్త ప్లాటో ప్రతిపాదించారు.

**బుద్ధిపై విశ్వాసం :** ప్రజ్ఞావంతుల విజ్ఞానాన్ని విశ్వసించటం. వీరి విశ్వాసాలపై దేశప్రగతి ఆధారపడి ఉంది.

**జాగృతిక ప్రగతి :** దీనిని భవిష్య శాస్త్రంలో త్వరితగతి మార్పు అని, త్వరణం అని అంటారు. నేటి సమాజం మార్పు చెందుతూ ఉంది. త్వరత్వరగా సంభవిస్తున్న మార్పుల వల్ల నూతన విలువలను అనుకూలంగా సమాజం సర్దుబాటు చేసుకోలేక పోతుంది. దీనినే త్వరణమని, త్వరితగత మార్పు అని, చైతన్యంలో మార్పు అనే అర్థాలతో వ్యవహరిస్తున్నాం. సామాజిక కట్టుబాట్లు వెనుకంజ వేస్తుంటే మన భావాలు భవిష్యత్తు లక్ష్యాలవైపు ముందంజ వేస్తున్నాయి.

**అనుకూలత :** సాంకేతిక విజ్ఞాన శాస్త్రాల పురోగతి వల్ల నేటి సాంఘిక జీవనంలో విద్యా సంస్థలు, నూతన పరిసరాలు దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. అనగా వివిధ రంగాలలో మారుతున్న విలువలకు అనుకూలంగా సర్దుబాటు చేసుకోవటం.

**అనుకూల పరిధి సిద్ధాంతం :** పరిస్థితులు త్వరగా మారుతున్న సమాజంలో ఏ మేరకు సర్దుబాటు చేసుకోగలం అనే ప్రమాణాన్ని కొలిచే సిద్దాంతం. వ్యక్తిగతమైన జాగృతి వల్లగాని, ప్రపంచంలోని సాంకేతిక అభివృద్ధి వల్లగాని సర్దుబాటు ఏర్పడిందని భవిష్య శాస్త్రం విశ్వసిస్తుంది.

**అశాశ్వత భావం :** ఈ భావం వ్యక్తిలో నైరాశ్యాన్ని కలిగించి పిరికితనానికి దారితీస్తుంది. అనేక సుస్థాపిత వ్యవస్థలు, సంస్థలు ఈ తాత్కాలిక భావాలకు తగినట్లుగా కొత్త నియమా లను, సూత్రాలను ప్రవేశపెడుతున్నాయి.

**సంకులిత కుటుంబం :** కుటుంబ సభ్యులందరూ కలిసికట్టుగా ఉండి ఒకేచోట జీవించటం. ఈ ఉమ్మడి కుటుంబాలు గ్రామీణ వ్యవస్థకు చెందినవి. పారిశ్రామికీకరణం వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు విచ్ఛిన్నం జరిగింది.

**దౌర్జన్య, దురాక్రమణ ఆధిపత్యం** : వివిధ వర్గాల, దేశాల మధ్య స్వప్రయోజనం కోసం జరిగే హింసాత్మక సంఘర్షణ. పారిశ్రామిక సమాజంలో దౌర్జన్యంతో కూడిన ప్రవర్తన సామాన్యంగా కనిపిస్తుంది.

**అరాచక వాదం :** నేటి సమాజాలు నీతి బాహ్యమైన స్వేచ్ఛా ప్రవృత్తి గల సమాజానికి దారితీస్తున్నాయనే వాదం. ఒక క్రమరాహిత్యం. సామరస్యరహితం, పారిశ్రామికాభివృద్ధి లేకపోవటం వలన సమైక్యత కోసం ఆలోచించక ప్రజలు అరాచకులై ఎవరి దృక్పథాన్ని వారు సమర్థించుకుంటున్నారు అని భవిష్య శాస్త్రవాదులు చెబుతున్నారు.

నగర వాసులు మానసిక క్షోభకు గురి అవుతున్నారు. వారు స్పర్థలు, యుద్ధాలు, వ్యాధులు కలుగుతాయని భయంతో ఆందోళనతో ఎదురు చూస్తున్నారు. ఈ మానసిక క్షోభ వారిని వెంటాడుతుంది. ఇది ఇలా ఉండగా గ్రామీణ ప్రజలు శాంతిని, సంపదను ఆశిస్తున్నారు. వీరి మనస్తత్వం స్థిరమైనది. శాంతి కాముకులు, కొంతమంది రచయితలు ఈ ఆక్షేపణనే అజ్ఞానం పెన్నిధి వంటిదని అన్నారు.

**ప్రత్యాశ ప్రజాస్వామ్యం :** ప్రతి మానవుడు తన హక్కును సమర్థించుకోవడానికి ప్రయ త్నించటం. హక్కు కావాలంటాడు కాని తన బాధ్యతలను నిర్వర్తించడు. ఉదాహరణకు ప్రభుత్వం రోడ్లను నిర్మిస్తానంటే తననెందుకు సంప్రదించలేదని వాపోతాడు. సమిష్టిని మర్చిపోయి వ్యక్తినే సమర్థించడానికి ప్రయత్నిస్తాడు. సంఘాన్ని మర్చిపోయి వ్యక్తిగతంగానే కొనసాగలని ఆరాటపడతాడు. భవిష్యత్ వాదులు కొన్ని సమయాలలో దీనినే మాబోక్రసి (మూక ప్రజాస్వామ్యం) అని అంటారు.

**ఉదాసీనత :** శూన్య మనస్తత్వం. అనగా నేటి తరం సనాతన సంప్రదాయాలవైపు ఉదాసీనత వహిస్తున్నారు. అంతేగాక నూతన వ్యవస్థలనూ, విలువలనూ సుస్థిరం చేయాలనే ఆలోచన లేకుండా శూన్య మనస్కులవుతున్నారని భవిష్యత్ వాదుల అభిప్రాయం.

**విలీనీకరణం :** మారుతున్న విలువలను ఇముడ్చుకోవటం, ప్రాచీన సంప్రదాయంలోని అనుకూల భావాలను గ్రహించి విలీనం చేసుకొనే సమర్థతను నేటి తరం వారు కోల్పోయారు. విలీనీకరణం లేకపోవటం వల్ల నేటి తరం వారు పరిపూర్ణ మూర్తిమత్వాన్ని పెంపొందించుకోలేక పోతున్నారు.

**అనుబంధ వ్యక్తి :** స్వప్రయోజనాలతో పాటు ఇతరులకు ప్రయోజనకరమైన పనులకు చేయూత నిచ్చి సహాయపడేవాడు. ఈ వ్యక్తినే సద్భావన వ్యక్తి అని అంటారు.

**యాంత్రిక వ్యవస్థ :** యాంత్రిక సాంకేతికాభివృద్ధి అధికం కావటం వల్ల నిత్య జీవితం యాంత్రికం కావటం. ఇది ఒక నాగరిక దశ.

**అపసవ్యం :** సవ్యమైన మార్గంలో ప్రవర్తించక పోవటం. పారిశ్రామికీకరణ కారణంగా ఏర్పడిన యాంత్రిక జీవనం వల్ల విశ్రాంతి విరామాలు లేకపోవటం వల్ల కలిగే స్థితి.

**విద్యా విషయ స్వేచ్ఛ :** 'విద్యా విధానంలో స్వేచ్ఛ' అనేది నేటి విద్యావంతుని నినాదం. విద్యావిషయ స్వేచ్ఛ నేటి విద్యకు ఆత్మ వంటిదని భావిస్తున్నారు. అధ్యాపక, విద్యార్థుల అభివృద్ధికి స్వేచ్ఛ చాలా అవసరం. ఈ స్వేచ్ఛ విద్యారంగాలలో అనేక నూతనాంశాల ఆవిర్భావానికి దారితీస్తుంది.

**ఆర్జిత లక్షణాలు :** జన్యుపరంగా కాక పరిసర ప్రభావం వల్ల వ్యక్తిలో ఆర్జిత గుణాలు, వంశానుగత గుణాలు అని రెండు రకాల గుణాలు ఉంటాయి. వంశపారంపర్యంగా సంక్రమించే జన్యు కణాల మార్పిడి వల్ల జీవకణాలు ఏర్పడతాయి. ఆపాదిత గుణాలు శారీరక కణాల మీద ఆధారపడి ఉంటాయి. వీటి మధ్య పరస్పర చర్య అధికంగా ఉంటుంది.

**క్రియాశీల శక్తి :** జీవితాన్ని చైతన్యవంతంగా చేసి లక్ష్యసాధన వైపు ప్రేరేపించే అంతర్గత శక్తి. ఈ శక్తి వ్యక్తిలో, అతడు చేపట్టిన పనిలో ఆసక్తిని కలిగిస్తుంది.

**స్థిర విధానం :** ప్రణాళికావేత్తలు ప్రయోగించే పద్ధతులు దృఢమైనవి. కాని కొన్ని సమయాలలో వీరు స్వల్పకాల పథకాలను నమ్ముతారు. వీరు స్థిరమైన పద్ధతులను, సూత్రాలను విశ్వసించరు. కాబట్టి ఆర్థిక వ్యవస్థ శాశ్వత అని అశాశ్వత ఆర్థిక వ్యవస్థ అని రెండుగా విభజింపబడింది. తక్కువ ఖర్చుతో తాత్కాలిక ప్రయోజనాన్నిచ్చే పథకాలు ఎక్కువ ప్రయోజనకరమైనవి కావు. ఉదాహరణకు ప్లాస్టిక్ వస్తువులు మొదలైనవాటి ఉత్పాదనకయ్యే ఖర్చు తక్కువని భావిస్తారు. కాని దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా చూస్తే అవి ఆర్థికంగా అనుకున్నంత లాభసాటి కాదు అని భవిష్యత్‌వాదులు, ఆర్థికశాస్త్ర వేత్తలు అభిప్రాయపడతారు.

**అనుకూల చర్య :** దూరదృష్టితో అనుకూల మార్గంలో చేసేది అనుకూల చర్య. వాగ్దానాలను దూరదృష్టితో అమలుపరుస్తూ ముందంజ వేయటం దీని పరమార్థం. సర్వసాధారణంగా సమాజంలో నాయకులకు, నిర్మాతలకు ఈ చర్య ఆపాదించబడుతుంది.

**వ్యవసాయానుకూల పాలన వ్యవస్థ :** సేద్యం చేసే వారందరినీ రైతులుగా ప్రోత్సహించే వ్యవస్థను వ్యవసాయానుకూల

పాలన వ్యవస్థ అని అంటారు. ఉదాహరణకు ఉత్పాదన వ్యయానికి తగినట్లుగా ఉత్పత్తి ధరలను పెంచి ప్రభుత్వం ధరల నియంత్రణ చేస్తుంది. దీని వల్ల సంక్షేమ స్వరాజ్యం ఏర్పడుతుంది.

**గ్రామీణ పరిరక్షణ సూత్రాలు :** గ్రామ ప్రజల్ని పరిరక్షించే సూత్రాలు. వ్యవసాయదారుల సంక్షేమం పట్ల నేటి నాయకులకు జాగృతి అధికమై గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంపొందించే సూత్ర నియమాలను ప్రవేశపెడుతున్నారు.

**మద్యపాన వ్యసనం :** మద్యపాన సేవనం వ్యసనంగా పరిణమించింది. ఇది మానసిక సాంఘిక ఆర్థిక శారీరక సమస్యలకు దారితీస్తుంది. మోతాదుకు మించి మద్యపానం సేవించినట్లయితే మానసిక అస్థిరతకు గురై సామాజిక సంబంధాలు కూడ దెబ్బ తింటాయి.

**ఎలర్జీ తత్వం :** ఎలర్జీ తత్వానికి సరిపడకపోవటం వల్ల దుష్ఫలితాలు కలుగుతాయి. ఈ ఎలర్జీలు పలురకాలు. ఒక తత్వానికి సరిపడని వాటి వల్ల ఏర్పడే వైరుధ్యాల వల్ల కలిగే ప్రతిచర్యలు, శారీరక మానసిక స్థాయిలలో ఉంటాయి.

**అంబ్రోషియన్ గ్రంథాలయం :** సామాన్య ప్రజల కోసం ఈ గ్రంథాలయం ఇటలీలో 605లో అంబ్రోస్ అనే ఆయన స్థాపించారు. దీనిలో ప్రాచీన పవిత్ర గ్రంథాలున్నాయి. ఇది మతాన్నే ప్రోత్సహిస్తుంది. కాని ఆధ్యాత్మిక భావాన్ని ప్రోత్సహించటం లేదన్న కారణంగా భవిష్యత్ వాదులు దీన్ని సమర్థించటం లేదు. సమాజంలో మతమనగానే విభాగాలు ఏర్పడతాయి. ఇటువంటి గ్రంథాలయాలను ప్రోత్సహించరాదని భవిష్యవాదుల ఉద్దేశ్యం.

**అంతర్జాతీయ క్షమ సంస్థ :** 1961లో స్థాపించబడింది. రాజకీయ నేరస్థులను విడిచి పెట్టాలని, కరుణ, దయ చూపాలని, సహృదయంతో వ్యవహరించాలని, లేని పక్షంలో మానవ విలువలు దెబ్బ తింటాయని ఈ సంస్థ ఉద్దేశ్యం. దీనికి 1977లో నోబెల్ బహుమానం లభించింది. ప్రపంచంలోని సమాజంలో ఉన్న సమస్యలపై స్వేచ్ఛగా చర్యలను కొనసాగిస్తున్నది.

**ఉభయచర యుద్ధ తంత్రం (నేలపై, నీటిపై జరిపే దాడి) :** క్రీ. పూ. 415లో ఏథెన్సు సిసిలీపై దాడి చేసినప్పుడు భూమిపై నుండి, నీటిపై నుంచి దాడులు కొనసాగించారు. కాబట్టి ఉభయచరాన్ని (ఆంఫీబియన్) దృష్టిలో ఉంచుకొని ఈ రకం యుద్ధతంత్రాన్ని 'ఆంఫీబియన్ యుద్ద తంత్రం' అన్నారు.

**భూ ఆక్రమణ :** భూ ఆక్రమణ అనే పదాన్ని అంతర్జాతీయ సూత్రాలనుండి గ్రహించారు. భూ ఆక్రమణం అంటే బలవంతంగా ఇతరుల భూమిని కైవసం చేసుకోవడం. అనేక దేశాలు ఇతర దేశాల సరిహద్దులను ఆక్రమించుకుంటాయి.

**పరహితత్వం ( ఆల్‌ట్రూజైషన్)** జపరులను ప్రేమించే గుణం. సోవియట్ సామాజిక శాస్త్రవేత్త పిటిరిమ్ ఎ సోరోకిన్ మొట్టమొదట (altruisation) పదాన్ని ప్రవేశపెట్టాడు. ఈ పదాన్ని సృజనాత్మక పరహితత్వం అనే భావంతో ప్రయోగించాడు. విశ్వ శ్రేయస్సును సాధించటమే దీని లక్ష్యం. వ్యక్తిగత స్థాయిలో, సామూహిక స్థాయిలో పరహితత్వాన్ని అనుసరించాలి. సోరోకిన్‌కి పూర్వం అగస్టన్ ఈ పదాన్ని ప్రయోగించాడు.

**సాంస్కృతీకరణ:** సక్రమ పద్ధతిలో సంస్కృతిని అభివృద్ధి చేయటం. వారసత్వం, కళ, మానవతావాదం,సమానత, న్యాయం, శాంతి వంటి గుణాలు సంస్కృతిని ప్రభావితంచేసి దాని ప్రగతికి కారణమవుతున్నాయి. మార్గరెట్ మీడ్ సామాజిక శాస్త్రంలో ఈ పదాన్ని ప్రయోగించారు.

**కృత్రిమ ప్రజ్ఞ :** విజ్ఞాన శాస్త్రాల్లోనూ, భవిష్య శాస్త్రంలోను అనేక పరిశోధకులు కంప్యూటర్లను ఉపయోగించి మానవ ప్రవర్తననూ మానవ ప్రజ్ఞను తీర్చిదిద్దుతున్నారు. దీనినే యాంత్రిక ప్రజ్ఞ అని అంటారు. దీనివల్ల సాధారణ ప్రజ్ఞ మరికొంత ఉన్నతస్థితికి ఎదుగుతుంది. యాంత్రిక విద్యుత్ పరికరాలతో సంబంధాన్ని నెలకొల్పడానికి, వాటితో భావ బోధన జరపడానికి 'సైబర్నిటిక్' అనే శాస్త్రాన్ని కూడా ఉపయోగిస్తున్నారు. దీనిని కృత్రిమ ప్రజ్ఞగా పరిగణిస్తున్నారు.

**ప్రవర్తన నియంత్రణ :** ప్రతికూల ప్రవర్తనను నియంత్రణ ద్వారా సంస్కరించటం, ప్రవర్తనలో అపక్రమాలను సంస్కరించటం దీని లక్ష్యం. అవాంఛిత ప్రవర్తనను అణచడం కూడ ఒక నియంత్రణ పద్ధతి. ఈ పద్ధతిని భవిష్య శాస్త్రవేత్తలు, మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు అధికంగా అనుసరిస్తున్నారు. మాదకద్రవ్యాలు, మద్యపాన సేవనం, భీతి మొదలైన వాటిని అపక్రమాలుగా పరిగణిస్తున్నారు. వీటిపైన విముఖత్వంతో చికిత్సద్వారా భవిష్య వాదులు బాగు చేస్తున్నారు.

**ప్రవర్తన ఇంజనీర్లు :** విద్యుత్, ఎలక్ట్రానిక్, యాంత్రిక ఇంజనీర్లు వారివారి రంగాలలో సామర్థ్యాన్ని చూపించి ప్రావీణ్యాన్ని ఆవిధంగానే తమ సాంకేతిక కౌశలం ద్వారా మానసిక శిక్షణ, స్వభావ జ్ఞానం ఉన్న యంత్రాల ద్వారా మానవునిలో భిన్న పీడనలను, దశలను గమనించి అతడి ప్రవర్తనలను అనుకూల మార్గంలో నడిపి వాంఛిత లక్ష్యాలవైపు వెళ్ళేట్లుగా చేసేవారిని ప్రవర్తన ఇంజనీర్లు అని వ్యవహరిస్తున్నారు.

**ప్రవర్తన సాంకేతిక శాస్త్రం :** మానవ ప్రవర్తనను అదుపులో పెట్టడాన్ని అధ్యయనం చేసే శాస్త్రం. మందులు, సాంకేతిక సాధనాలు మూలంగా మానవ ప్రవర్తనను, శారీరక రుగ్మతలను సరిచేయటం జరుగుతోంది. ఉదాహరణకు ఆయాత చికిత్స, ప్రేరణ ఆయస్కాంత రంగాలు, విద్యుత్, రేడియో తరంగాల చికిత్స, అల్ట్రాసోనిక్ పరీక్ష మొదలైనవి ప్రసిద్ధమైన ప్రవర్తన సాంకేతిక శాస్త్ర పద్ధతులు.

కన్నవారు సంరక్షించువారు జీవదాతలు. పాశ్చాత్య దేశాలలో పుట్టిన పిల్లల విషయంలో జీవదాతల సంబంధాలు, ఆధార రహితాలు జీవశాస్త్రవేత్తల ఆగస్ట్ పిష్మాన్స్ సిద్ధాంతం దీనిని బలపరుస్తుంది.

**మేధావుల వలస :** ఆయారంగాలలో మేధావంతులు ఉన్నత ఉద్యోగాలకోసం ఇతర దేశాలకు వలస పోతున్నారని భవిష్య శాస్త్రవేత్తల నమ్మకం. మేధావంతులు వలస పోవడాన్నే మేధావుల కొరత అని అంటారు. దీనివల్ల దేశానికి వివిధ రంగాలలో మేధావుల వలస ఏర్పడుతుంది.

**మేధ క్షాళనం (బ్రెయిన్ వాషింగ్) :** ఇతరుల ప్రమేయంతో ఆలోచన విధానంలో కలిగిన బలవంతపు మార్పు. సంపూర్ణాధికార దేశాలయిన రష్యా, చైనాలో మేధోక్షాళన విరివిగా కొనసాగు తుంది. తమ దేశ రహస్యాలు బయటికి వెల్లడి కాకుండా ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. దేశాల నియంతృత్వంలో రహస్యంగా ఈ పద్ధతిని అమలుపరుస్తున్నారు. ప్రవర్తనలో, ఆలోచన విధానంలో సంపూర్ణమైన మార్పు రావాలని ఆఘాతాలను అనుమాన వ్యాఘాతాలను కల్పిస్తున్నారు.

**ఉద్యోగి స్వామ్యం :** ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పాలన జరిపే వ్యవస్థ. ఇది బ్రిటీష్ వారి నుండి సంక్రమించింది. వారు ప్రవేశపెట్టిన ఐ.సి.యస్ వంటి ఉద్యోగాలు అదే ధోరణిలో ఐ.ఎ.ఎస్. పరిపాలన నిర్వహణలోనే కొనసాగుతున్నాయి. అలా కాకుండా ఆ దృక్పథం లోనే మార్పు రావాలని భవిష్య శాస్త్రవేత్తల ఉద్దేశ్యం. భవిష్య

శాస్త్రవాదుల దృక్పథంలో ఉద్యోగిస్వామ్యంలో భారతీయ పరిపాలనా సేవకులు భారత జాతీయ సేవకులుగా మారాలి. అప్పుడే వారు సేవాబద్ధులై ఉంటారు.

**క్షురక మీమాంస (బార్బర్ పరాడోక్స్) :** క్షురకుడు పడే సందిగ్ధావస్థ. ప్రొటెస్టంటులు కాథలిక్కులు భిన్నమైన క్షుర కర్మను చేసుకునే రోజుల్లో వారు ఏ తెగకు చెందినవారో తెలియక క్షురకుడు వారిని అడగలేక సందిగ్ధావస్థలో పడిపోయేవాడు.

**మౌలిక చర్య :** కంప్యూటర్ భాషలో ఒక ప్రత్యేకమైన చర్య.

**అపనమ్మకం :** నమ్మకం లేకపోవటం అని అర్థం. నమ్మకంతో పనిచేసేవారు సత్ఫలితాలను పొందుతారు. అపనమ్మకస్తులు వాంఛిత లక్ష్యాలను సాధించలేరు. నమ్మకం సంకల్పం సమైక్య జీవనానికి దారి తీస్తుంది.

**అధికార సంతులనం (బ్యాలన్స్ ఆఫ్ పవర్) :** యుక్తితో సామర్థ్యాలను అదుపులో పెట్టడమే అధికార సమతుల్యత. ఎలిజబెత్ రాణి ఇంగ్లాండులో యుద్ధాలు చేసి రాజ్యాన్ని స్థాపించడానికి అధికార తుల్యతను పాటించింది.

**ప్రాథమిక అవసరాలు :** ఈ పదం సంక్షేమ ఆర్థిక శాస్త్రం నుండి భవిష్యశాస్త్రం గ్రహించింది. భిన్న వృత్తులకు, భిన్న దేశాలకు ప్రాథమిక అవసరాలు భిన్న ప్రమాణాలలో ఉన్నాయి. కొన్ని దేశాలకు, వృత్తులకు కారు ప్రాథమిక అవసరం. ఒక దేశానికి ప్రథమ అవసరంగా కనిపించేది మరొక దేశానికి ప్రాథమిక అవసరం కాకపోవచ్చును.

**మౌలిక సముదాయం :** ప్రతిదేశంలో మౌలిక సముదాయాలు, అల్పసంఖ్యాక సముదాయాలు ఉన్నాయి. భారతదేశంలో ముఖ్యమైన జాతి హిందువులు అని హిందువులందరు భారతీయులని, హిందు అనేది మౌలిక జాతి అని మధ్వాచార్యుని సర్వదర్శన సంగ్రహం, కౌటిల్యుని అర్థశాస్త్రం వక్కాణిస్తున్నాయి. దీనిని భవిష్య వాదులు కూడ బలపరుస్తున్నారు. డి.యమ్. దత్తా సింధునదీ పరీవాహక ప్రాంతాల్లో నివసించేవారందరూ హిందువులని చెప్పారు.

**జీవ ప్రవర్తన పరిశీలన శాస్త్రం (బయోనమిక్స్) :** ఇది గ్రీకు పదం. జీవికి దాని పరిసరాలతో ఉన్న సంబంధాన్ని గురించి చెప్పే శాస్త్రం. దీనినే భవిష్యశాస్త్రం మానసిక పరిసరాలతో, బాహ్య పరిసరాలతో వ్యక్తికి ఉన్న సంబంధాన్ని తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంది.

**ప్రపంచ మేధో సమావేశం :** మానసిక ఆందోళన లేదా వ్యక్తిగత అనుభూతుల పరంపరను మేధో సంక్షోభం అని అంటారు. మేధస్సుకు అలసటను కలిగించే సమావేశాలు కూడా జరుపబడతాయి.

**మేధావుల ట్రస్ట్ :** సామాన్య ప్రజలడిగే ప్రశ్నలకు తడుముకోకుండా జవాబిచ్చే మేధావులతో కూడిన ట్రస్ట్. ఈ మేధావులు సాధారణంగా తీవ్రమేధోపరంపర సమావేశాలలో పాల్గొన్నారు.

**క్రూర ప్రవర్తన వాదం :** దయ, కరుణ, ప్రేమ, జాలి అనేవి లేకుండా ఉండే మనిషి ప్రవర్తనను గురించి చెప్పేవాదం.

**బ్రౌన్ గమనం (చలన క్రమం లేని గమనం) :** 1827లో రాబర్ట్ బ్రౌన్ (వృక్షశాస్త్రవేత్త) ద్రవంలో మునిగిన చిన్న కణాల మధ్య జరిగే గమనం క్రమంలేకుండా ఉండటాన్ని గమనించాడు. దీనికి బ్రౌన్ గమనం అనే పేరు స్థిరపడింది. భవిష్య శాస్త్రవేత్తలు క్రమం లేని కణాల చలనం వలననే మానవులు కూడ లక్ష్యంలేని వారై తిరుగుతున్నారు అని భావిస్తున్నారు.

**ప్రవర్తన వాదం :** 1913లో జె.బి. వాట్సన్ పరిచయం చేసాడు. ఇది మనోవిజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన శాఖ. అంతర ప్రవృత్తి కంటే బాహ్య ప్రవృత్తికి ప్రాధాన్యమిస్తుంది. నికృష్ట దశలో ఉన్న మానవుడి ప్రవర్తనను ఉత్కృష్ట స్థాయికి తీసుకురావడమే ఈ వాదంలోని లక్ష్యాలలో ప్రముఖమైనది.

**పండుగలు :** సంప్రదాయంగా జరుపుకుంటున్న పండుగలు, సంఘటనలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే మానవ సంక్షేమానికి ప్రాముఖ్యానిచ్చే పండుగలే అని భవిష్యత్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

**సంతాన విముఖత :** కొందరు పిల్లల్ని కనడం అంటే స్వేచ్ఛను పోగొట్టుకోవడం అని పాశ్చాత్యులు అభిప్రాయపడుతున్నారు. సంతానం వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకమని భావించి స్వేచ్ఛా ప్రియత్వాన్ని కోరుకుంటున్నారు.

**శిశు సంరక్షక సాంకేతిక పద్ధతులు :** శిశు సంరక్షక కేంద్రాలలో శిశు రక్షణకోసం చేపట్టే సాంకేతిక విధానాలు. పిల్లల మానసిక అభివృద్ధి కోసం కృత్రిమ ప్రజ్ఞను కల్పించే సాంకేతిక సాధనాలను ఉపయోగించటం.

**పరిజ్ఞాన అపశ్రుతి :** జ్ఞాన సముపార్జనలో సమగ్రావగాహన లోపం. ఆధునిక విజ్ఞానం పెంపొంది పలు శాఖలుగా అభివృద్ధి చెందటం వలన ప్రత్యేకాంశాలలో అధ్యయనం అధికమై సంబంధిత అంశాలను అశ్రద్ధ చేయటంవల్ల అవగాహనా పరిధి పరిమితమై సంపూర్ణ జ్ఞానం కొరవడుతుంది.

**నిబద్ధత :** ఒక పనికి బాధ్యతాయుతంగా పూనుకోవటం ఆదర్శం. ఉత్సాహం దీనికి ప్రధానం. నిబద్ధతతో చేసే పని విజయవంతం అవుతుంది అని భవిష్య వాదులు విశ్వసిస్తారు.

**సాముదాయిక శిబిరం :** ఈ పదాన్ని భిన్న దేశాలలో భిన్న అర్థాలతో వ్యవహరిస్తున్నారు. సంపూర్ణాధికార రాజ్యాలలో (ఉదాహరణకు రష్యా, చైనా) ఈ కేంద్రాలను ఏకాగ్రత శిబిరాలుగా పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు కూడా జరుగుతాయి. సంపన్న దేశాలలో ఇది పవిత్రకేంద్రంగా వ్యవహరిస్తున్నారు. ఇది నైతిక సమస్యల్ని ఆధ్యాత్మిక సమస్యల్ని చర్చిస్తుంది. సమాజ, సంస్కృతికి భిన్నంగా వర్తించే హిప్పీలు కూడ ఈ సముదాయాల కోవకు చెందినవారే.

**ప్రసారాలు :** అధునాతన పద్ధతిలో కృత్రిమ ఉపగ్రహాల ద్వారా రేడియో, టెలివిజన్, ఫోన్ వంటి సాధనాల మూలంగా పంపే సంకేతాలు. దీనివల్ల సమస్త ప్రపంచంలో సంబంధాన్ని ఏర్పరచుకుంటున్నాం. పూర్వం ప్రసారాలు కేవలం భూమిపై మాత్రమే కొనసాగేవి.

**వినియోగదారుని అవసరాలు :** జీవన ప్రమాణాన్ని ఇతరులతో పోల్చుకోవడం వల్ల వినియోగదారుని అవసరాలు పెరుగుతున్నాయి. పెరుగుతున్న అవసరాల తాకిడిని తట్టుకోలేక పోవడం వల్ల వ్యక్తి మానసిక ఘర్షణకు గురి అవుతున్నాడు. ఇతరులతో పోల్చుకోవడానికి తన శక్తిని బట్టి పరిమితం చేసుకోవాలని భవిష్య వాదుల అభిప్రాయం.

**సమైక్య కుటుంబం :** కలిసి కట్టుగా ఒకే వృత్తిని అనుసరిస్తూ ఉండే కుటుంబం పరిస్థితులకు అనుకూలంగా సర్దుబాటు చేసుకుని లక్ష్యసాధనకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇది సమష్టి కుటుంబం వంటిది.

**భవిష్య సమితి :** సామాజిక, ఆర్థిక, విద్యా సమస్యల్ని భవిష్య కాలంలో కొన్ని సమితులు పరిష్కారిస్తాయని భవిష్య శాస్త్రవేత్తల దృక్పథం. ఈ సమితిలో ప్రభుత్వ ఉద్యోగులే కాక సామాన్య ప్రజలు కూడ పాల్గొంటారు.

**సంక్షోభ చర్య :** భవిష్యవాదులు క్లిష్ట పరిస్థితులను పరిష్కరించడానికి పర్యవేక్షక మండలి ఏర్పాటై, భిన్న దృక్పథాలతో చర్చించి, అవగాహన చేసుకుని ఒక నిర్ణయానికి వస్తారు.

**పరస్పర ప్రభావం :** ఒక సమస్యను గురించి పదిమంది కలిసి చర్చించినప్పుడు పలువురు పలు అభిప్రాయాలను తెలియజేస్తారు. దానివల్ల అందరి అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. చర్చలో పాల్గొన్న వ్యక్తుల అవగాహనను కూడ పెంపొందిస్తుంది.

**సాంస్కృతిక స్తబ్దత :** నాగరికతలో తిరోగతి పురోగతి లేక ఆగిపోవడం. యుద్ధాలు, కరువు కాటకాలు, వాఙ్మయం క్షీణించడం సాంస్కృతిక స్తబ్దతకు కారణాలు.

**సాంస్కృతిక గమనం :** ప్రత్యేక రంగాలలో నిష్ణాతులైనవారు సాంస్కృతికాభివృద్ధి కోసం చేసే కృషి తిరోగతికి దారితీస్తుందా అని పరీక్షించి పురోగతి మార్గాన్ని ఎన్నుకోవటం.

**వస్త్రధారణ సంస్కృతి :** ఇది అభిరుచుల్లో వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంది. దర్జీ కూడా సంస్కృతికి కారకుడవుతాడు. దర్జీ బట్టలు కుట్టి తెచ్చేలోగానే ఫ్యాషన్ మారిపోవటం, మరొక అత్యాధునిక వస్త్రధారణ రీతి ప్రచారంలోకి రావటం జరుగుతుంది. అందువల్ల దర్జీ కూడ సంస్కృతికి కారకుడౌతున్నాడు.

**సాంస్కృతిక అఘాతం :** ఫ్యూచర్ షాక్ పుస్తకంలో అల్విన్ టాఫ్లర్ ఈ పదాన్ని వాడారు. మారుతున్న సమాజంతో మానవుడు సర్దుబాటు చేసుకోలేకపోవడం వల్ల పొందే అఘాతం.

**అవిచ్ఛిన్న సత్తా :** మానసికంగా పెరగటం వల్ల వ్యక్తిలోని సత్త మారుతూ ఉంటుందని పరామనోవిజ్ఞానశాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సత్త చైతన్యం వైపు వెళ్ళినప్పుడు వ్యక్తి మానసికాభివృద్ధిని పొందుతాడు. ఈ విధంగా సత్త చలనం అవిచ్ఛిన్నంగా కొనసాగుతుంది. తరతరాల సత్త అనుభవాలను అందజేస్తుంది.

**అంతీంద్రియ దృష్టి :** ఎదురుగుండా లేని దానిని అంతీంద్రియ శక్తులతో చూడటం. మానసిక శక్తుల వల్ల, అభ్యాసం వల్ల ఎదుటలేని వాటిని మానసికశాస్త్రవేత్తలు చూడ గలుగుతున్నారు. యోగులు యోగిక శక్తులతో చూస్తారు. రెనాల్డ్ సీ జాన్సన్ అనే పరామనో విజ్ఞానశాస్త్రవేత్త మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల దృష్టిని అంతీంద్రియ జ్ఞానం అని, యౌగిక దృష్టిని అధ్యాత్మిక జ్ఞానం అని ఈ రెంటికి మధ్య ఉన్న తేడాను శాస్త్రీయంగా వివరించారు. పద్ధతులు భిన్నమైనా భవిష్య ఆలోచనలకు ఉపయోగకరంగా ఉన్నాయి.

**విమర్శనాత్మక వాస్తవిక వాదం :** దీనిని 1916లో ఆర్.యు.నెల్లార్ వ్యాప్తిలోకి తెచ్చారు. దీనినే ఇంగితజ్ఞాన వాస్తవికవాదం అని అన్నారు. ఆర్.బి.పెర్రి, జి.ఇ.మూర్‌లు కలిసి "యం.ఐ.యన్.డి" అనే తత్వశాస్త్ర పత్రికలో ఈ వాదంలోని లోపాలను ఎత్తిచూపుతూ 'రిపిటేషన్ ఆఫ్ ఐడియలిస్ట్' అనే ఒక వ్యాసాన్ని ప్రకటించారు. దీనినే నవ్యవాస్తవిక వాదం అంటారు. ఆదర్శవాదాన్ని విమర్శించడం.

**సాంస్కృతిక సంఘర్షణ :** భిన్న సంస్కృతుల మధ్య సంఘర్షణ ఉండటం. మాలినోవిస్కీ, బ్రిటిష్ మానవ శాస్త్రవేత్త దీనిని పేర్కొన్నారు. ఒక దేశ సంస్కృతి ఇతర దేశాల సంస్కృతులకు భిన్నంగా ఉండటం వల్ల సంఘర్షణ కలుగుతుంది. ఇటీవల మానవ శాస్త్రవేత్త భవిష్యత్ శాస్త్రవేత్త అయిన మార్గరేట్ మీడ్ ప్రాథమికంగా సంస్కృతులన్నీ ఒక్కటేననీ దేశకాల పరిస్థితుల కారణంగా సంస్కృతుల మధ్య భిన్నత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. మానవ జీవనానికి ఆధారమైన చైతన్యం, దాని లక్ష్యం ఒకటేనని వారి ఉద్దేశ్యం.

**సృజనాత్మక పరహిత వాదం :** ఇది సోవియట్ సమాజ శాస్త్రవేత్త పిటిరమ్ ఎ. సోరోకిన్ ప్రవేశపెట్టిన సిద్ధాంతం. విశ్వజనీన ప్రేమను కలిగి ఉండాలని ఈ సిద్ధాంతం చెబుతుంది.

**సమగ్రాకృతి వాదం :** కోహిలర్, కాఫ్కా అనే గెస్టాల్ట్ మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు ఈ వాదాన్ని పరిచయం చేసారు. ఇది విశ్లేషణాత్మక మనోవిజ్ఞాన శాస్త్రానికి భిన్నమైనది. ఏ విషయాన్నయినా విడివిడిగా కాకుండా సమగ్ర ఆకృతిగా చూడాలనే దృక్పథం. చారిత్రకారులు, సంఘటనలను విడివిడిగా వివరిస్తారే గాని సమగ్ర దృక్పథం ఉండదు. అందువల్లనే పిలాసఫీ ఆఫ్ హిస్టరీ (చారిత్రక తత్త్వశాస్త్రం) ఏర్పడింది.

**వికేంద్రీకరణ :** బాధ్యతలు ఒకచోట కేంద్రీకరించకుండా అందరికీ పంచటం. ఉదాహరణకు పంచాయితి లేదా పురపాలక సంఘ సభ్యులకు అధికార నిర్వహణలను, బాధ్యతలను పంచి యిచ్చే పాలన పద్ధతి. ఇక్కడ హక్కుల కంటే బాధ్యతల నిర్వహణ ముఖ్యం.

**నిర్ణయం తీసుకోవటం :** ఒక సముదాయం కాని, కంప్యూటర్ గాని తీసుకునే నిర్ణయం. ఒక్కోసారి కంప్యూటర్లలో నిర్దిష్ట నిర్ణయాలను ముందే ప్రవేశపెడతారు. ఉదాహరణకు అమెరికా రష్యా వంటి దేశాల మధ్య వైరుధ్యం ఏర్పడుతుందని అనుకుందాం. అమెరికన్లు యుద్ధ నౌకను పంపించారు. నౌకకు సంబంధించిన నిర్దిష్ట రహస్య నిర్ణయాన్ని వైట్ హౌస్‌లోని కంప్యూటర్ తెలియజేసింది (ఈ విషయం తరువాత శత్రు దేశాలకు తెలిసింది).

**మిశ్రమ నిర్ణయం :** ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది ఆలోచనలను సమైక్య దృష్టితో మిశ్రమం చేయటం వల్ల సరియైన తుది నిర్ణయానికి చేరుకోవచ్చు. ఇది భవిష్య శాస్త్రవేత్తల భావం.

**నిర్ణయ భారం :** ఒక సమస్యపై అనేక నిర్ణయాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీసుకోవటం కొన్ని సమయాలలో ఇబ్బందిగా ఉంటుంది. తీసుకున్న కొన్ని సమయాల్లో తీవ్ర పరిణామాలకు దారి తీసేవిగా ఉండొచ్చు. సమస్య కంటే నిర్ణయాలు అధికంగా ఉంటాయి. ఇటువంటి నిర్ణయ భారాలు యుద్ధానికి సిద్ధంగా ఉన్న దేశాలకు ఉపయోగకరంగా ఉంటాయి.

**నాణ్యత తగ్గుదల :** మార్కెట్‌లో వస్తువుల నాణ్యత దిగజారిపోతుంది, ధరలు పెరుగు తున్నాయి. కాని నాణ్యత పెరగటం లేదు. నిత్యావసర వస్తువుల వాడకం ఎక్కువయినప్పుడు కూడా ధరలు పెరగకుండా నాణ్యత తగ్గకుండా వుండాలని భవిష్య శాస్త్రవేత్తల అభిప్రాయం.

**భాషా విభేదం :** భాషాపరమైన విభజన వల్ల రాష్ట్రాల వ్యవస్థ ఏర్పడింది. కాబట్టి సమాజంలో సమైక్యత కొరవడి విభేదాలు ఏర్పడ్డాయి.

**ఉపద్రవ యాజమాన్యం (నిర్వహణ) :** ఉపద్రవాలను అదుపులో పెట్టడానికి భవిష్య శాస్త్రవేత్తలు సూచించిన నవీన పద్ధతి. ఆయా ఉపద్రవాలను ఎదుర్కోటానికి కావలసిన భౌతిక మానసిక శక్తులను అందించి వారిని స్థిరపరచడం.

**డిస్నీలాండ్ :** 1955లో వాల్ట్‌డిస్నీ అనే అమెరికా సినీ నిర్మాత కాలిఫోర్నియాలో డిస్నీలాండును పిల్లల వినోదం కోసం స్థాపించారు. పారిశ్రామిక దేశాలలో అలాంటి వినోద కేంద్రాలు అన్ని వయస్సుల వారికి ఉండాలని భవిష్య శాస్త్రవేత్తల అభిప్రాయం. అవి మానసిక రుగ్మతలను దూరం చేసేవిగా ఉండాలి.

**ఆర్థిక కేంద్రీకరణ వాదం :** పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక వ్యవస్థ కొందరి చేతిలోనే కేంద్రీకృతమై ఉంటుంది.

కాబట్టి డబ్బు వృధా కాదు, కానీ సామాన్య ప్రజల కొసం అది ఆశించిన మేరకు అందదు. వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ ఆ విధంగా కాకుండా వ్యయం కొంత ఎక్కువైనప్పటికీ సామాన్య ప్రజలకు ఆర్థిక సహాయం అందుతుంది. అందుచేత కేంద్రీకరణ వ్యవస్థలోని ఆర్థిక భద్రత వికేంద్రీకరణకు వ్యక్తిలోని హక్కులు, పంపిణీ విధానం కలుపుకొన్న ఆర్థిక వ్యవస్థ ఉండాలని భవిష్య వాదులు అంటున్నారు.

**సర్వవ్యాప్త క్రైస్తవ సంస్థ (ఇక్యుమినికల్ ఇనిస్టిట్యూట్) :** క్రైస్తవ చర్చిలో సమస్త క్రైస్తవ ప్రపంచానికి చెందిన సంస్థను స్థాపించారు. 1948లో జరిగిన సమావేశం ఈ సంస్థ పుట్టుకకు కారణం. ఇది క్రైస్తవ సముదాయాన్ని ప్రోత్సహించే విశ్వవ్యాప్తమైన భావాలు కలది. దీనినే విశ్వవ్యాప్త ఉద్యమం అని అంటారు.

**ప్రాకారాల పునాదులు :** విప్లవాత్మక పాత్రను వహించిన రచయితలు, చింతనాపరులు, కవులు సమాజ నిర్మాతలు. గతంలో ఉన్నవారు మరణించినా, భవిష్యత్తులో శాశ్వతంగా జీవిస్తారు. వీరి సృజనాత్మక కృషి వలన నాగరికత, చరిత్ర రూపుదిద్దుకుంటుంది. సంస్కృతిని తీర్చిదిద్దే వారు వీరేనని భవిష్య శాస్త్రవేత్తల అభిప్రాయం.

**భవిష్యత్తులో స్థానం ఏర్పరుచుకున్న గతకాలపు మేధావి :** గతంలోని సృజనాత్మక రచయితలు, కవులు చింతనాపరులు మానవ చరిత్రకు మార్గాన్ని చూపించినవారు. అనేక దేశాలలో ఇటువంటివారు కుటుంబ సభ్యులతో కలసి జీవిస్తూనే ఏకాంతాన్ని కోరుకునేవారు. ఎంక్లేవ్ అనగా ఏకాంత సౌధం.

**పరిసరాల కాలుష్యం :** పరిసరాలు రెండు రకాలు–భౌతికం, మానసికం. మానసిక భౌతిక పరిసరాలలో కాలుష్యాన్ని తగ్గించడాన్ని గురించి భవిష్య మనోవిజ్ఞాన శాస్త్రాలు అధ్యయనం చేస్తున్నాయి.

**క్షణికం :** క్షణికాన్ని భవిష్యవాదులు విశ్వసించారు. కాలాన్ని వ్యవధానం అని, సంఘటనల ప్రవాహం అని తాత్త్వికులు వివరించారు. మన ఆలోచన విధానం క్షణికం కాదు. వర్తమానం భవిష్యత్తుకు దారితీస్తుందని భవిష్యశాస్త్రవేత్తల విశ్వాసం. భూత, భవిష్యత్ పరిస్థితులను అభివృద్ధి చేయటానికి సహృదయులు ప్రయత్నించాలని భవిష్యవేత్తలు చెబుతున్నారు.

**ఎలక్ట్రానిక్ యుగం :** భవిష్యత్ శాస్త్రంలో నాగరికతను భిన్న దశలుగా వర్గీకరించారు. వ్యావసాయక దశ, పారిశ్రామిక దశ, మలి పారిశ్రామిక దశ, ఎలక్ట్రానిక్ దశ. ప్రస్తుతం. రోదసి దశ నడస్తున్నది. ఈ దశలోనే సమస్యల అధ్యయనానికి భిన్న గమనాలు అవసరం. ఎలక్ట్రానిక్ యుగంలో జీవన పరిధితో పోల్చినట్లయితే లక్ష్యసాధన అనంతంగా ఉంది. వేగవంతమైన గమనం అవసరం.

**ఆర్థికాభివృద్ధి :** అన్నిటికంటే ఆర్థికంగా పెరుగుదల అత్యవసరం అని అన్ని దేశాలు విశ్వసిస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి మూలంగానే విద్య, పారిశ్రామిక, సాంస్కృతిక రంగాలలో అభ్యున్నతి కొనసాగుతుందని భవిష్య శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

**అతినైతిక వాదం :** నైతిక పదాలతో సంబంధమున్న వాదం. 1920–40 మధ్యకాలంలో స్టీవెన్‌సన్ దీనిని పరిచయం చేసారు. ప్రబోధాల మూలంగా తన భావాలను ఇతరులు పంచుకొని ఇతని దృష్టిలో అనైతికం అనుసరించడానికి చేసే ప్రయత్నాన్ని అతి నైతికవాదం అన్నారు. గర్భస్రావం అంటే ఇతని దృష్టిలో అనైతికం. కాని ప్రాపంచిక దృష్ట్యా నైతికంగానే భావించాలి. కనుక జనాభా పెరుగుదల దృష్ట్యా (భవిష్య వాదులు) ఈ వాదాన్ని అంగీకరించరు.

**అప్రధాన పెరుగుదల :** జీవశాస్త్రంలోను, మనోవిజ్ఞానశాస్త్రంలోను ఈ పదం కనిపిస్తుంది. ఇది వికాసానంతరం కలిగే అప్రధాన పెరుగుదల. ఆ మీదట అభివృద్ధి కొనసాగదు. మనస్సులతో సంబంధమున్న వాదం. ఈ వాదానికి ముందు రెండు రకాల అభిప్రాయాలు ఉన్నాయి.

1. శరీర మనస్సుల మధ్య పరస్పర చర్య ఉంటుంది 2. మనస్సు శరీరాలు సమాంతరం.

ఈ సిద్ధాంతాలను 1874లో బి. హెచ్.హక్స్లే ఈ విధంగా వివరించారు. చైతన్యాభి వృద్ధి, మేధాభివృద్ధి ప్రక్రియలో జరిగే ప్రధాన అభివృద్ధి. మానసిక సంఘటనలు భౌతిక సంఘటనలకు, భౌతిక సంఘటనలు మానసిక సంఘటనలకు దారితీస్తాయని చెప్పారు.

**సారాంశవాదం :** అస్తిత్వం కంటే సారాంశం ముఖ్యమని చెప్పే వాదం. వస్తువుల కంటే భావాలు ముఖ్యమని ప్లాటో చెప్పిన సిద్ధాంతాన్ని అనుసరించి భవిష్య శాస్త్రవేత్తలు అస్తిత్వాని కంటే సారాంశం ముఖ్యమని తేల్చి చెప్పారు. వస్తువు ఉనికి కంటే దాన్ని గురించిన భావమే ముఖ్యమని సారాంశవాదం. అరిస్టాటిల్ కూడ అన్ని వస్తువులకు సారాంశం ఉంటుందని వివరించారు. సారాంశ వాదానికి వ్యతిరేకం.

**చైతన్య నిపుణులు :** వ్యక్తిగత, సామూహిక చైతన్యాన్ని మెరుగుపరచటం పూర్వం యోగులకు మాత్రమే సాధ్యం అయ్యేది. శాస్త్రీయ పద్ధతుల ద్వారా కృత్రిమ విజ్ఞానం వలన చైతన్యాన్ని సంస్కరించవచ్చని నేటి భవిష్య శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**భవిష్య అఘాతం :** 1970లో ఆల్విన్ టాఫ్లర్ వ్యవహారంలోకి తెచ్చిన పదం. ఇది మలి పారిశ్రామిక సమాజంలోని మానసిక రుగ్మత. చిత్రదర్శినిని తిప్పే కొద్ది ఏవిధంగా త్వరగా వస్తు సముదాయం మారుతుంటుందో ఆ విధంగానే సమాజం కూడ త్వరగా మారుతుందని పేర్కొన్నారు. త్వరిత గతిన జరిగే మార్పుల వల్ల ప్రజలలో భయాందోళనలతో కూడిన అఘాతం ఏర్పడుతుందిని 'ఫ్యూచర్ షాక్' అనే గ్రంథం విడమరచి చెపుతుంది.

**భవిష్య స్వీయ చరిత్రలు :** వ్యక్తి తనదైన మార్గంలో తన అనుభవాలను ఇతరులకు రచన ద్వారా అందించటం స్వీయచరిత్ర. ఇది చారిత్రక పత్రాల వంటిది. భవిష్యత్తులో స్వీయ చరిత్రలు కేవలం చారిత్రక సమాచారలనందించే పత్రాలే కాక ప్రేరణ నిచ్చేవిగా ఉంటాయని భవిష్య శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

**భవిష్య ఊహలు :** ఆధారం లేకుండానే రాబోయే దానిని, జరగబోయే దానిని ముందుగానే ఊహించటం. భవిష్య ఊహలు భవిష్య జీవనానికి ఆశాజనకాలు అనే అర్థంతో వ్యవహరిస్తారు.

**భావి చైతన్యం :** మనస్సుకు జాగృతిని కల్పించటం చైతన్యం. భవిష్యత్తు వైపు జాగృతిని పెంపొందింపజేయటం భావిచైతన్యం. దీని వల్ల వ్యక్తి తనను తాను గుర్తించటానికి, తనలోని శక్తులను గుర్తించడానికి వీలవుతుంది. వ్యక్తిని, సమాజ నాగరికతను తీర్చి దిద్దడానికి ఇది ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఈ విధంగా చైతన్యం పెరగటం వల్ల అచేతన తగ్గుతుంది.

**భవిష్య సమావేశాలు :** ఒక ఉద్దేశ్యంతో అందరూ ఒకచోట సమకూడడం సమావేశం. సర్వసాధారణంగా సమావేశాలలో సమస్యలకు సంబంధించిన చర్చ లెక్కువ, పరిష్కారాలు తక్కువ. కాని భవిష్య సమావేశాలలో చర్చలు తక్కువ (మేధోసంక్షోభం), పరిష్కారాలు ఎక్కువ ఉంటాయి.

***భవిష్య సమితులు :*** దూరదృష్టి,న్యాయ వివేచన ఉన్న వ్యక్తులు భవిష్య జీవనానికి భవిష్య మార్గాలను ఆలోచిస్తారు. భవిష్య శాసనసభ తాత్త్విక నాయకుల సభగా మారవచ్చునని భవిష్య శాస్త్రవేత్తల అభిప్రాయం.

***భవిష్య పరిశోధనలు :*** జాగ్రత్తగా చేసే శోధన పరిశోధన. పెరుగుతున్న విజ్ఞానంలో ఒక నిర్దిష్ట అంశం మీద ప్రత్యేకంగా చేసే శోధన. కూడబెట్టిన విజ్ఞానంపై పండితుల సమావేశాలపై భవిష్య పరిశోధనలు దృష్టిని కేంద్రీకరించవు. జాగృతి, చైతన్యం, పరిశోధన, సమ్యక్సాధన అన్నదే వారి లక్ష్యం.

***భవిష్య ధోరణులు :*** ప్రాచీన పద్ధతులను, అవగాహనను ఎదిరించి ప్రగతిశీల భావాలను, క్రియలను నెరవేర్చడానికి మార్గాన్ని చూపే ధోరణులు.

***భవిష్య వాదం :*** ప్రాచీన ధోరణులను అధిగమిస్తూ భూత, వర్తమానల కంటే భవిష్యత్తును, భావిసంఘటనలను శాస్త్రీయంగా ఊహించి ఎక్కువగా ఆలోచించడం.